RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 12 సెప్టెంబర్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:91

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం**
**సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన**
**ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని**
**బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు**




ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు.

బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

# విద్య కోసం 15 శాతానికి బడ్జెట్ ను పెంచడమే మా లక్ష్యం

**శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



తెలంగాణ విద్యా విధానంపై సభలో చర్చ జరగడం ఒక శుభ పరిణామం

సభ్యుల సూచనలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది

దేశ తొలి ప్రధాని నెహ్రూఎడ్యుకేషన్, ఇరిగేషన్ రెండు అంశాలను ప్రాధాన్యతగా తీసుకున్నారు

దేశంలోని ఏ విద్యా సంస్థ అయినా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వేసిన పునాదులపైనే నిర్మితమైంది

ఇప్పుడున్న చాలా యూనివర్సిటీలు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసినవే

విద్య ఒక్కటే మన జీవితాల్లో వెలుగును తీసుకొస్తుందని సంపూర్ణంగా నమ్ముతున్నా

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సీపెక్ సర్వే నిర్వహించింది

సామాజిక వెనుకబాటుకు ఆస్తులు అంతస్తులు కాదు... విద్య లేకపోవడమే సామాజిక వెనుకబాటు తనానికి కారణమని సర్వేలో తేలింది ప్రపంచంతో పోటీ పడాలంటే విద్య విధానంలో తీసుకు రావాల్సిన అంశంపై చర్చించాల్సిన అవసరం ఉంది

తెలంగాణ నూతన విద్యా విధానం రూపొందించేందుకు విద్య కమిషన్ ను ఏర్పాటు చేశాం

విద్యా కమిషన్ అందించిన రిపోర్ట్ ను పరిశీలించేందుకు కేకే నేతృత్వంలో ఒక కమిటీని నియమించాం

మీ సూచనలు, సలహాలను కేశవరావు కి అందిస్తే ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉంది

విద్య కోసం 15 శాతానికి బడ్జెట్ ను పెంచడమే మా లక్ష్యం

పూర్తిస్థాయి విద్యా శాఖ మంత్రి లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అంటున్నారు

ముఖ్యమంత్రి ఆ శాఖను నిర్వహిస్తున్నారంటే ఆది అత్యంత ప్రధానమైనదని అర్థం

ముఖ్యమంత్రిగా నేను ఎడ్యుకేషన్ సమీక్ష చేస్తే మొత్తం సిస్టమ్ వచ్చి సమీక్షలో ఉంటుంది

ఈ మాత్రం తేడా కూడా సభ్యుడికి తెలియకపోవడం బాధాకరం

మిగతా 3 లో

# రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది: ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

**బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారన్న సబిత**
**ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంటుందని వ్యాఖ్య**
**తోపులాటలో జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని ఆవేదన**



తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు.

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.

శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

# రూపాయి భారం లేకుండా ఉద్యోగులకు కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా

**రాష్ట్రంలో 12.91 లక్షల మందికి లబ్ధి.. జీవో 77 ద్వారా అమలు**
**ఇప్పటికీ 89 మంది ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా అందించాం**
**శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమగ్రంగా సమాధానమిచ్చారు. ఖజానాపై గానీ, ఉద్యోగుల వేతనాలపై గానీ ఒక్క రూపాయి భారం పడకుండా, మానవీయ కోణంలో దేశంలోనే తొలిసారిగా రూ. కోటి దాకా ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు.

ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే బీమా: ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తున్నందున, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార పురోగతికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77 ను జారీ చేసిందని వివరించారు.

మిగతా 2 లో

# ఖైరతాబాద్ వినాయకుడి తొలి పూజకు రావాలని గవర్నర్‌కు ఉత్సవ కమిటీ ఆహ్వానం





హైదరాబాద్, సెప్టెంబర్ 11,2026: ఖైరతాబాద్ మహాగణపతికి నిర్వహించే తొలి పూజకు హాజరై పూజలు చేయాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానించింది.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలోని గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు శుక్రవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాల వివరాలను గవర్నర్‌కు వివరించారు.ఈ నెల 14వ తేదీ నుంచి 25 వరకు గణేష్ ఉత్సవాలు జరగనున్నాయి.అంతకుముందు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ హైదరాబాద్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ డాక్టర్ వరుణ్ కిషోర్ ,తెలంగాణ క్షయవ్యాధి సంఘం ఉపాధ్యక్షుడు శ్రీ సుధీర్ ప్రసాద్ లోక్ భవన్‌లో గౌరవనీయ గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లాను కలిశారు.

# 22ఏ అనేది పొరపాటు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం: హరీశ్ రావు



వార్తా 3 లో

# ప్రజాబలం

12 సెప్టెంబర్ 2026 శనివారం

## పెట్రో.. పసిడి.. రూపాయి.. చివరకు దారెటు?

దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే మూడు కీలక అంశాలు ఒకేసారి ప్రతికూల దిశలో కదులుతున్నప్పుడు ఆందోళన చెందడం సహజం. పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి, పసిడి ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణత– ఈ మూడు పరిణామాలు ప్రస్తుతం సామాన్యుడి నుంచి వ్యాపార వర్గాల వరకు ప్రతి ఒక్కరినీ కలవరపెడుతున్నాయి. వీటికి తోడు అంతర్జాతీయంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు, పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడిచమురు మార్కెట్‌లో అనిశ్చితి వంటి అంశాలు పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ప్రశ్న ఒక్కటే– పెట్రో.. పసిడి.. రూపాయి.. చివరకు దారెటు? చమురు ధరల పెరుగుదల అనేది కేవలం వాహనదారుల జేబుపై పడే భారం కాదు. అది ఆర్థిక వ్యవస్థలోని దాదాపు ప్రతి రంగాన్నీ తాకే ప్రభావశీలమైన అంశం. భారతదేశం తన ఇంధన అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగినప్పుడు దిగుమతి బిల్లు పెరుగుతుంది. అదే సమయంలో దేశీయ కరెన్సీ బలహీనపడితే, విదేశీ మారకంలో చెల్లించాల్సిన మొత్తం మరింత భారమవుతుంది. అంటే చమురు ధర పెరగడం ఒక సమస్య అయితే, రూపాయి విలువ పడిపోవడం ఆ సమస్యను రెట్టింపు చేసే ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఇంధన ధరల ప్రభావం రవాణా రంగంతో మొదలై వ్యవసాయం, పరిశ్రమలు, నిర్మాణ రంగం, సరఫరా వ్యవస్థ, రిటైల్ మార్కెట్ వరకు విస్తరిస్తుంది. లారీలు, బస్సులు, ట్యాక్సీలు, సరుకు రవాణా వాహనాల నిర్వహణ వ్యయం పెరిగితే దాని ప్రభావం చివరకు వస్తువుల ధరలపై పడుతుంది. రైతులకు డీజిల్ ధర పెరగడం అంటే సాగునీటి పంపులు, వ్యవసాయ యంత్రాలు, పంట రవాణా వంటి అనేక ఖర్చులు పెరగడమే. పరిశ్రమలకు ఇంధన వ్యయం పెరిగితే ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఉద్యమమే మందు ఉత్పత్తిదారుడు ఆ భారాన్ని పూర్తిగా భరించలేకపోతే వినియోగదారుడిపైనే కొంత భాగాన్ని మోపాల్సి వస్తుంది. ఇదే ద్రవ్యోల్బణానికి దారితీసే ప్రధాన మార్గాల్లో ఒకటి. ఇంధన ధరలు పెరిగినప్పుడు రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే ఆహారం నుంచి తయారీ వస్తువుల వరకు అనేక ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే చమురు ధరల కదలికను కేవలం పెట్రోల్ బంకుల వద్ద కనిపించే ధరలతో కొలవడం సరికాదు. దాని ప్రభావం కుటుంబ బడ్జెట్‌లోని అనేక అంశాలపై పరోక్షంగా కనిపిస్తుంది. ఇక రూపాయి విలువ విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే దిగుమతుల వ్యయం పెరుగుతుంది. చమురు మాత్రమే కాదు –ఎలక్ట్రానిక్ పరికరాలు, యంత్రాలు, కొన్ని పారిశ్రామిక ముడి పదార్థాలు, రసాయనాలు, ఇతర దిగుమతి ఆధారిత వస్తువుల ధరలపైనా ప్రభావం పడుతుంది. అయితే రూపాయి పతనానికి అంతా ప్రతికూలమే అని చెప్పలేం. ఎగుమతిదారులకు కొంత ప్రయోజనం లభించే అవకాశం ఉంటుంది. కానీ దేశ ఆర్థిక వ్యవస్థలో దిగుమతుల ప్రాధాన్యం అధికంగా ఉన్న పరిస్థితుల్లో కరెన్సీ బలహీనత ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచే ప్రమాదం మాత్రం విస్మరించలేనిది. ఈ నేపథ్యంలో బంగారం మరో ప్రత్యేక కథ చెబుతోంది. సాధారణంగా అంతర్జాతీయ అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మార్కెట్లలో అస్థిరత పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గుచూపుతారు. బంగారానికి అలాంటి సమయంలో డిమాండ్ పెరగవచ్చు. దేశీయంగా రూపాయి బలహీనపడటం కూడా రూపాయి లెక్కల్లో బంగారం ధర పెరగడానికి కారణమయ్యే అవకాశం ఉంది. అందుకే ఒకవైపు స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు గురవుతుంటే మరోవైపు పసిడి ధరలు పైకి కదలడం కనిపిస్తుంది.బంగారం ధర ఎప్పుడూ ఒకే దిశలో పెరుగుతుందని భావించడం కూడా పొరపాటే. అంతర్జాతీయ వడ్డీ రేట్లు, అమెరికా డాలర్ బలం, కేంద్ర బ్యాంకుల విధానాలు, పెట్టుబడిదారుల సెంటిమెంట్, ప్రపంచ ఆర్థిక వృద్ధిపై అంచనాలు వంటి అనేక అంశాలు బంగారం ధరను ప్రభావితం చేస్తాయి. అందుకే రోజువారీ ధరల మార్పులను చూసి భయపడటం కన్నా, దీర్ఘకాలిక ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడం అవసరం. మరోవైపు స్టాక్ మార్కెట్లలో కనిపిస్తున్న ఒడిదుడుకులు కూడా ఈ సమీకరణంలో భాగమే. ముడిచమురు ధరలు పెరిగితే దిగుమతి ఆధారిత కంపెనీల ఖర్చులు పెరిగే అవకాశం ఉంటుంది. రూపాయి బలహీనపడితే విదేశీ మారకపు రుణాలు లేదా దిగుమతులపై ఆధారపడే సంస్థలపై ఒత్తిడి రావచ్చు. అదే సమయంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను తగ్గిస్తే మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరగవచ్చు. అయితే కొన్ని ఎగుమతి ఆధారిత రంగాలకు బలహీన రూపాయి అనుకూలంగా మారే అవకాశమూ ఉంది. కాబట్టి మార్కెట్‌లో ప్రతి రంగం ఒకే విధంగా ప్రభావితమవుతుందని భావించడం సరికాదు. అందువల్ల పెట్రో, పసిడి, రూపాయి అనే మూడు సూచికలను విడివిడిగా చూడటం కన్నా వాటి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. చమురు ధరలు పెరిగితే దిగుమతి బిల్లు పెరుగుతుంది; దిగుమతి బిల్లు పెరిగితే రూపాయిపై ఒత్తిడి రావచ్చు; రూపాయి బలహీనపడితే దిగుమతులు మరింత ఖరీదవుతాయి; అంతర్జాతీయ అనిశ్చితి పెరిగితే బంగారం వైపు పెట్టుబడులు మళ్లవచ్చు; మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింటే స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతాయి. ఈ పరిణామాలన్నీ చివరకు సామాన్యుడి జీవన వ్యయంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కాబట్టి నేటి పరిస్థితి కేవలం ధరల పెరుగుదల కథ కాదు –ఆర్థిక స్థిరత్వానికి ఎదురవుతున్న పరీక్ష. తాత్కాలిక ఉపశమన చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇది. పెట్రో మంటను తగ్గించాలి, రూపాయి విలువను నిలబెట్టే ఆర్థిక పునాదులను బలోపేతం చేయాలి, పసిడి ధరల ఊగిసలాట వెనుక ఉన్న అంతర్జాతీయ అనిశ్చితిని అర్థం చేసుకోవాలి. అప్పుడే ద్రవ్యోల్బణం నుంచి సామాన్యుడికి ఉపశమనం లభిస్తుంది. ప్రపంచ పరిణామాలు మన తలుపు తట్టకముందే వాటి ప్రభావాన్ని అంచనా వేసి సిద్ధపడటమే సమర్థ ఆర్థిక పాలన. లేకపోతే పెట్రో మంట, పసిడి మెరుపు, రూపాయి పతనం– మూడూ కలిసి దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాలుగా మారే ప్రమాదం ఉంది. ప్రశ్న దారెటు? అనేదే కాదు; సరైన దారిని ఇప్పుడే ఎంచుకోగలమా? అన్నదే అసలు ప్రశ్న

# పాడి రంగం బలోపేతానికి ప్రజా ప్రభుత్వం చర్యలు -- మంత్రి వాకిటి శ్రీహరి

**పాడి రైతులకు గిట్టుబాటు ధర..**
**గోపాలమిత్రలకు సంక్షేమ సౌకర్యాలు**
**మధిర, కొడంగల్‌లో సెర్ఫ్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ**
**పశుసంవర్ధక శాఖలో 1100 మందికిపైగా ఉద్యోగులకు**
**ప్రమోషన్లు.. పారదర్శకంగా బదిలీలు**

హైదరాబాద్: రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేసి, పాడి రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

శుక్రవారం శాసనసభలో సభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, గండ్ర సత్యనారాయణ రావు, వీర్లపల్లి శంకరయ్యలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.

**పెరుగుతున్న పాల ఉత్పత్తి–మంత్రి వాకిటి శ్రీహరి**

రాష్ట్రంలో పాల ఉత్పత్తి క్రమంగా పెరుగుతోందని మంత్రి తెలిపారు. 2024--25లో 59.35 లక్షల టన్నులు, 2025--26లో 61.75 లక్షల టన్నుల పాల ఉత్పత్తి నమోదైందన్నారు. 2026--27లో ఆరు నెలల కాలానికి సుమారు 30 లక్షల టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుందని ముందస్తు అంచనా ఉన్నట్లు వెల్లడించారు.

**పాడి రైతులకు గిట్టుబాటు ధర–మంత్రి వాకిటి శ్రీహరి**

పాడి రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

2026 ఆగస్టు 16 నుంచి గేదె పాలకు ప్రతి కిలో వెన్నకు రూ.914, ఆవు పాలకు ప్రతి కిలో వెన్నతో పాటు మొత్తం ఘనపదార్థాల ప్రాతిపదికన రూ.340 ధరలను నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.

రైతులకు నాణ్యమైన పాల సేకరణకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పాడి రంగాన్ని గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయ వనరుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు.

**మధిర, కొడంగల్‌లో పాడి గేదెల పంపిణీ–మంత్రి వాకిటి శ్రీహరి**

పాడి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా మధిర, కొడంగల్ నియోజకవర్గాల్లో సెర్ఫ్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

పాడి పశువుల సంఖ్యను పెంచడంతో పాటు, రైతులకు నిరంతర ఆదాయం వచ్చేలా పాడి ఆధారిత జీవనోపాధిని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

**గోపాలమిత్రల సంక్షేమానికి ప్రాధాన్యం–మంత్రి వాకిటి శ్రీహరి**

పాడి రంగంలో క్షేత్రస్థాయిలో కీలక సేవలు అందిస్తున్న గోపాలమిత్రల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.

గోపాలమిత్రలకు మెడిక్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద బీమా, సకాలంలో గౌరవ వేతనం, శిక్షణ, సాంకేతిక సహాయం, పర్యవేక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

పశువుల ఆరోగ్యం, పాడి రైతుల ప్రయోజనాలు, గ్రామీణ పాడి వ్యవస్థ బలోపేతంలో గోపాలమిత్రల పాత్ర కీలకమని మంత్రి అన్నారు.

**పశుసంవర్ధక శాఖలో ప్రమోషన్లు.. పారదర్శక బదిలీలు**

పశుసంవర్ధక శాఖలో సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి తెలిపారు.

1100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**ఆక్సిటోసిన్ వినియోగంపై ప్రత్యేక ప్రతిపాదన లేదు–మంత్రి వాకిటి శ్రీహరి**

పాడి పరిశ్రమలో ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ప్రత్యేకమైన ప్రతిపాదన ఏదీ లేదని మంత్రి స్పష్టం చేశారు.

అయితే పశువుల ఆరోగ్యం, పాల నాణ్యత, వినియోగదారుల భద్రత, పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

**నందిని కంటే విజయ డెయిరీ ఎక్కువ ధర చెల్లిస్తోంది–మంత్రి వాకిటి శ్రీహరి**

కర్ణాటకలోని నందిని డెయిరీతో పోలిస్తే తెలంగాణలో విజయ డెయిరీ ద్వారా పాడి రైతులకు ఎక్కువ ధరలు చెల్లిస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

పాడి రైతుల ఆదాయాన్ని పెంచడం, పాల సేకరణ వ్యవస్థను బలోపేతం చేయడం, విజయ డెయిరీని మరింత బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ పాడి రంగానికి కొత్త దిశను చూపిస్తామని మంత్రి పేర్కొన్నారు.

"పాడి రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.. పాడి పరిశ్రమ బలోపేతమే గ్రామీణ ఆర్థికాభివృద్ధికి పునాది" అని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

# రూపాయి భారం లేకుండా ఉద్యోగులకు కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా

మొదటి పేజీ తరువాయి

**89 క్లెయిమ్‌ల పరిష్కారం**

ఈ పథకం ద్వారా ఇప్పటికే 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారాన్ని అందించినట్లు తెలిపారు. ఇందులో

?సింగరేణిలో 50, విద్యుత్ శాఖ (SPDCL, NPDCL, TGGENCO) ఉద్యోగులు 15,

?వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 24 మంది ఉన్నారు.

**రూ. 2.20 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు ఎయిర్ యాక్సిడెంట్ కవరేజ్**

??బ్యాంకులు అందించే శాలరీ మరియు పెన్షన్ అకౌంట్ ప్యాకేజీల ఆధారంగా బీమా ప్రయోజనాలు వర్తిస్తాయని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం వంటి సందర్భాల్లో ఉచిత బీమా వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 2.20 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు కవరేజ్ లభిస్తుందని, సాధారణ ప్రమాద మరణానికి కూడా కొన్ని కేటగిరీల్లో రూ. 1.50 కోట్ల కంటే ఎక్కువ బీమా అందుతుందని స్పష్టం చేశారు.

**12.91 లక్షల మందికి ప్రయోజనం**

రాష్ట్రంలో మొత్తం 12,91,046 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వ్యవస్థకు ఈ పథకం వర్తిస్తుందని వెల్లడించారు. ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ ప్రభుత్వ సిబ్బంది (3,58,138 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 29,900 మంది గ్రాంట్–ఇన్–ఎయిడ్, 4,328 మంది యూనివర్సిటీ సిబ్బంది, 8,716 మంది ఇతర సంస్థల సిబ్బంది, 1,17,211 మంది కార్పొరేషన్లు/పిఎస్‌యూ ఉద్యోగులు) ఉన్నారు. అలాగే 5,00,158 మంది తాత్కాలిక సిబ్బంది (85,255 మంది కాంట్రాక్ట్ సిబ్బంది, 49,396 మంది గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లు, 1,32,798 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, 15,762 మంది డైలీ వేజెస్ సిబ్బంది, 2,16,947 మంది గౌరవవేతనం వర్కర్లు) మరియు 2,72,615 మంది పెన్షనర్లు (1,58,540 మంది సర్వీస్ పెన్షనర్లు, 1,10,976 మంది ఫ్యామిలీ పెన్షనర్లు కేటగిరీ–1, 1,846 మంది కేటగిరీ–2 పెన్షనర్లు, 1,253 మంది ప్రొవిజనల్ పెన్షనర్లు) కవర్ అవుతారని వివరించారు.

?ఈ పథకాన్ని తొలుత ఫిబ్రవరి 2024లో సింగరేణి ఉద్యోగులకు, ఆ తర్వాత జూన్ 2024 నుంచి విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అందరికీ వర్తింపజేశామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని శాఖల అధిపతులకు, కార్యదర్శులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని సభకు వివరించారు.

# సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్‌కు ప్రతిష్ఠాత్మక పదోన్నతి

**ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ తరపున**
**మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి,**
**శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు**



హైదరాబాద్ సెప్టెంబర్ 11: తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ గారు అదనపు సంచాలకుడిగా (Additional Director) పదోన్నతి పొందిన సందర్భంగా ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బానోతు వెంకట్ నాయక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ డి.ఎస్. జగన్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా డి.ఎస్. జగన్ కి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో డి.ఎస్. జగన్ విజయవంతంగా రాణించాలని, తన సేవలతో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా మీడియా రంగానికి సంబంధించిన పలు అంశాలతో పాటు, జర్నలిస్టులు మరియు సమాచార, పౌర సంబంధాల శాఖ మధ్య సమన్వయంపై స్నేహపూర్వకంగా చర్చించారు.

# ఆటవీ ఆమరవీరులకు సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళులు

హైదరాబాద్ "అటవీ సంపద, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తూ అమరులైన అటవీ శాఖ సిబ్బందికి అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు.

అడవులు, వన్యప్రాణులను కాపాడే క్రమంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన అటవీ అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయం. విధి నిర్వహణలో వారు ప్రదర్శించిన ధైర్యం, అంకితభావం, నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారు చూపిన మార్గంలో ముందుకు సాగుదాం. అడవులను కాపాడుదాం. వన్యప్రాణులను సంరక్షిద్దాం. ప్రకృతిని పరిరక్షిద్దాం. భావితరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందిద్దామని అయన అన్నారు.

## లక్ష మంది పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు: శాసనమండలిలో జీవో 97 ప్రతులను చించివేసిన

# ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్

### పాలిటెక్నిక్ కళాశాలలను తలాతోకా లేని 'స్కిల్ యూనివర్సిటీ'లో విలీనం చేయడం దుర్మార్గం

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**

హైదరాబాద్ తేదీ: సెప్టెంబర్ 11, 2026 జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన మల్టీలేయర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సిస్టమ్‌ను విధ్వంసం చేయడం నెహ్రూ విద్యా విధానాలకు పూర్తిగా విరుద్ధం

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పసిపిల్లలపై పోలీసుల లాఠీఛార్జీలు, నిర్బంధాలా?

పేద, బలహీన వర్గాల ఇంజనీరింగ్ భవిష్యత్తును అంధకారం చేసే జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల వేల కోట్ల భూములను కాజేసే కుట్రలను సహించేది లేదు: శాసనమండలిలో గళమెత్తిన దాసోజు

తెలంగాణ శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన (Special Mention) ద్వారా పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ గళమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకువచ్చిన నిరంకుశ జీవో 97ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, సభలోనే ఆ జీవో ప్రతులను చించివేసి తన నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు:

నెహ్రూ విద్యా విధానాలకు తూట్లు: దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దశాబ్దాల క్రితం ప్రవేశపెట్టిన మల్టీలేయర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సిస్టమ్‌ను ఈ ప్రభుత్వం విధ్వంసం చేస్తోందని, ఇది నెహ్రూ ఆశయాలకు, విద్యా విధానాలకు పూర్తిగా వ్యతిరేకమని మండిపడ్డారు.

లక్ష మంది విద్యార్థుల ఆత్మగౌరవ పోరాటం: జీవో 97 అనేది కేవలం ఒక సాధారణ జీవో



కాదని, రాష్ట్రంలోని దాదాపు లక్ష మంది పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల బిడ్డల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. ఎన్నో దశాబ్దాలుగా ఉన్న బహుళ అంచెల సాంకేతిక విద్యా వ్యవస్థను కనీస చర్చ లేకుండా రద్దు చేయడం క్షమించరాని నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులపై పోలీసుల దమనకాండ: తమ భవిష్యత్తును కాపాడుకోవడానికి రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్న విద్యార్థులను పోలీసులు గొర్ల మందలా ట్రీట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాకీ దుస్తుల పోలీసులను పంపి ముక్కుపచ్చలారని పిల్లలను బెదిరిస్తున్నారని, లాఠీఛార్జీలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

చరిత్రను తుడిచిపెట్టే యత్నం: 1923లో నిజాం కాలంలో మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ ప్రారంభమైందని, 1957లో పీవీ నరసింహారావు గారి హయాంలో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఏర్పడిందని గుర్తుచేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ పాలిటెక్నిక్ వ్యవస్థ స్వతంత్రంగా కొనసాగుతోందని పేర్కొన్నారు.

యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ డొల్లతనం: కనీస మౌలిక సదుపాయాలు, అర్హులైన అధ్యాపకులు లేని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయడం విద్యార్థుల జీవితాలను గోదారిపాలు చేయడమేనని విమర్శించారు.

ప్రైవేటీకరణ – వేల కోట్ల భూములపై కన్ను: ప్రభుత్వ పాలిటెక్నిక్ వ్యవస్థను పీపీపీ (ప్రైవేటు) మోడల్‌లోకి నెట్టి క్రమంగా ప్రైవేటీకరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేల కోట్ల రూపాయల విలువైన ప్రైమ్ భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతోందని తీవ్రంగా అనుమానం వ్యక్తం చేశారు.

తక్షణమే ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యార్థులపై నిర్బంధాన్ని ఆపాలని, జీవో 97ను రద్దు చేసి పాలిటెక్నిక్ స్వయంప్రతిపత్తిని కాపాడాలని డాక్టర్ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రుల పక్షాన ప్రజా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును రక్షించేందుకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఈ పోరాటంలో ప్రజా సంఘాలు, విద్యార్థి లోకం భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్య కోసం 15 శాతానికి బడ్జెట్ ను పెంచడమే మా లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

నాకు విద్యా శాఖపై ఒక ప్యాషన్ ఉంది

2023-24 బడ్జెట్ లో బీఆరెస్ ప్రభుత్వం విద్యా శాఖ కు రూ.19,093 కోటల కేట్లయిస్తే.. మా ప్రభుత్వం 2024-25 బడ్జెట్ లో రూ.21,292 కోట్లు కేటాయించింది

2025-26 బడ్జెట్ లో ఆ మొత్తాన్ని రూ.23,108 కోట్లకు, 2026-27 బడ్జెట్ లో రూ.26,647 కోట్లకు పెంచాం.

కేవలం మూడేళ్లలో విద్యా శాఖ బడ్జెట్ ను రూ.7,554 కోట్లకు పెంచాం.

మేం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 55 రోజుల్లోనే 10,006 మంది టీచర్ల ఉద్యోగాలు భర్తీ చేశాం

చిన్న ఆరోపణ లేకుండా ఉద్యోగ నియామకాలు పూర్తి చేశాం

గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 7857 మంది టీచర్లను నియమించారు

జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరానికి కూడా దృష్టిలో ఉంచుకుని విద్యా విధానం తీసుకొస్తున్నాం

దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని, తలరాతలు మార్చేది విద్యా అని నమ్మి విద్యా శాఖ నా దగ్గర పెట్టుకున్నా

ప్రపంచంలోనే బెస్ట్ ప్రాక్టీసెస్ ను తీసుకొస్తున్నాం

కొన్నిసార్లు కొన్ని నిర్ణయాలు చేసినపుడు కొన్ని వివాదాలు జరుగుతాయి

అలాంటిదే పాలిటెక్నిక్ కాలేజీలకు సంబంధించిన జీవో ఎంఎస్ నెం.97

నేను విద్యా శాఖ మంత్రిగా బాధ్యత తీసుకున్నాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 86 వేల మంది పెరిగారు

ఇది విద్యా శాఖ మంత్రిగా నా పనితీరుకు నిదర్శనం

## 22ఏ అనేది పొరపాటు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం: హరీశ్ రావు

**రేవంత్ రెడ్డి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారన్న హరీశ్**

**మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్**

**సామాన్యుల ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలన్న హరీశ్**

తెలంగాణలో నిషేధిత భూముల జాబితా 22ఏ వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



పాలనను పక్కనపెట్టి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై కన్నేశారని హరీశ్ రావు ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తే చాలని ప్రచారం చేసుకున్నారని, కానీ నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసినా బాధితులకు ఎలాంటి పరిష్కారం దొరకడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం... బడా బాబులు నిర్మించిన అక్రమ నివాసాల జోలికి మాత్రం వెళ్లడం లేదని విమర్శించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. 2ఏ నిషేధిత జాబితా నుంచి ముఖ్యమంత్రి నివాసాన్ని తొలగించినప్పుడు, అదే జాబితాలో ఉన్న సామాన్య ప్రజల నివాసాలను, భూములను ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. తక్షణమే పేదల, సామాన్యుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్.. 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

**ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా 40 శాతానికి పైగా ఉందన్న పుతిన్**

**జీ7 వాటా 29 శాతమేనని వెల్లడి**

**ఐదేళ్ల ప్రపంచ వృద్ధిలో బ్రిక్స్ వాటా సగానికి పైగానే ఉందని వెల్లడి**

**జీ7 వృద్ధి వాటా 18 శాతంగా ఉందని ప్రస్తావన**

**బ్రిక్స్ కోసం కొత్త పెట్టుబడి వేదిక ఏర్పాటుకు పుతిన్ ప్రతిపాదన**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉందని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు.

న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరం'లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు.



బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు.

బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.

రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పుల దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.

## బీసీ కులగణన చేపట్టకపోతే బిజెపినీ గద్దె దింపడం ఖాయం

**తక్షణమే జాతి జనగణను నిలిపివేయాలి**

**జనగణన ప్రశ్నావళిని వెంటనే రద్దు చేయాలి**

**జాతి జనగణపై జాతీయస్థాయిలో అఖిలపక్ష పార్టీలు సామాజిక నిపుణులతోజేన్ సమావేశం ఏర్పాటు చేయాలి**

**బీసీలను నమ్మించి వంచించితే దేశంలో బిజెపికి ఇదే చివరి పాలన అవుతుంది**

**బీసీ కులగనను వ్యతిరేకిస్తే బిజెపి నేతలకు పిండ ప్రధానశీ పెడతాం**

**అసెంబ్లీలో వ్యతిరేకిస్తే బిజెపి కార్యాలయం ముందు వంటవార్పు నిర్వహిస్తాం**

**వచ్చే నెలలో లక్షలాదీ మందితో పార్లమెంట్ ముట్టడి చేపడతాం**

**బీసీల ధర్మ పోరాట దీక్షలు బిజెపి పై తీవ్రంగా మండిపడ్డ జాజుల శ్రీనివాస్ గౌడ్, వీహెచ్, మధుసూదనాచారి, నెల్లి కంటి సత్యం, ఈరావత్ అనిల్ ల వెల్లడి**



హైద్రాబాద్ సెప్టెంబర్ 11:దేశంలోని ఎనబై కోట్ల మంది బీసీల జీవితాలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెలగాటమాడుతుందని, పేరుకు కులగనన చేస్తున్నామని చెప్తూనే కులగనన ప్రశ్నావళిలో బీసీ కాలం చేర్చకుండా, ప్రతి కులానికి యూనికోడ్ కేటాయించకుండా బీసీలను నమ్మించి వంచిస్తుందని, ఇదే వైఖరి అవలంబిస్తే దేశంలోని బీసీలు ఒక్కటై బిజెపిని గద్దె దించడం ఖాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రధాని నరేంద్ర మోడీని తీవ్రంగా హెచ్చరించారు

ప్రస్తుతం జరుగుతున్న జాతి జనగణనలో ఓబీసీ కాలం చేర్చాలని, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో బీసీల ధర్మ పోరాట దీక్షలు చేపట్టారు అందరూ భాగంగానే హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద పెద్ద ఎత్తున బీసీల ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షకు ఈ ధర్మ పోరాట దీక్ష సభాధ్యక్షులుగా కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ వ్యవహరించగా,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావు, టిఆర్ఎస్ శాసనసభా పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఈరావత్రి అనిల్ కుమార్ తో పాటు బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కుర్మా,

మహిళ సంఘం అధ్యక్షురాలు బి.మనిమంజరి,80 కుల సంఘాలు, 30 బీసీ సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళ, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## కాలుష్య నియంత్రణలో ఢిల్లీ బెస్ట్

విశాఖపట్టణం, సెప్టెంబర్ 11, రాజధాని ఢిల్లీతో పోటీ పడడమే కాదు బెస్ట్ ర్యాంక్ ని విశాఖపట్నం అందుకుంది. దేశ రాజధానితో సమానంగా విశాఖ పెర్ఫార్మెన్స్ చేయడం ఇక్కడ విశేషం. ఏ విషయంలో అంటే కాలుష్య నియంత్రణలో. పకడ్బందీగా చర్యలు తీసుకుని విశాఖ దేశంలోనే మంచి ర్యాంక్ ని అందుకుంది. అలాగే ఢిల్లీ తో కలసి 21వ ర్యాంక్ ని సాధించింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో ఢిల్లీ విశాఖ 21వ ర్యాంక్ ని కలిసి పంచుకున్నాయి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' ర్యాంకులలో విశాఖ ఈ విధంగా ఇంట్రెస్టింగ్ రిజల్ట్ ని సాధించింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకులలో లక్నోకు అగ్ర స్థానం దక్కింది. ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో నంబర్ వన్ గా నిలిచింది. అలాగే ఇండోర్ రెండో స్థానంలో ఉంటే 195 పాయింట్లతో జబల్‌పూర్ మూడో స్థానంలో ఉంది. ఇక ఢిల్లీ 172 పాయింట్లతో విశాఖపట్నంతో కలిసి 21వ స్థానాన్ని పంచుకుంది. గత ఏడాది ఢిల్లీ 32వ స్థానంలో ఉంది. అయితే ఈసారి ఢిల్లీ తన ర్యాంకును మరింతగా మెరుగుపరుచుకోవడం విశేషంగా పేర్కొంటున్నారు. దేశంలో చూస్తే ఇతర ప్రధాన నగరాలైన హైదరాబాద్ 19వ స్థానంలో ఉంటే పాట్నా 16, ముంబై 28, చెన్నై 35, కోల్‌కతా 38వ స్థానాల్లో నిలిచాయి.ఏమిటీ ర్యాంకులు వీటి వెనక కథ ఏంటి అంటే ఈ ర్యాంకులు అందుకున్న నగరాల్లో కాలుష్యం పూర్తిగా తొలగిపోయింది అని కాదు, అయితే కాలుష్యం విషయంలో ఈ నగరాలు తీసుకుంటున్న కీలక చర్యలు, రోడ్లపై దుమ్ము ధూళీ లేకుండా సక్రమంగా ఉంచడం, పేరుకుపోకుండా ఘన వ్యర్థాల తొలగింపు, వాహనాల ద్వారా పరిశ్రమల ద్వారా వెదజల్లే ఉద్గారాలను వీలైనంత మేరకు తగ్గింపు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, కాలుష్యం మీద ప్రజలలో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకులను జాతీయ స్థాయిలో ప్రకటిస్తారు. ఈ నగరాలలో గాలి నాణ్యత తక్కువగా ఉండొచ్చు అయితే కాలుష్య నియంత్రణ చర్యలు బలంగా అమలు అవుతున్నందువల్ల ఏదో నాటికి నాణ్యమైన గాలి ఆ నగరాలకు దక్కుతుందని అంటున్నారు. జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహిస్తోంది నిజానికి ఢిల్లీ అంటేనే కాలుష్యం అని చెబుతారు. శీతాకాలంలో అయితే ఢిల్లీలో ఎవరూ ఉండలేని పరిస్థితి తలెత్తుతుంది.

# ప్రభుత్వ వైద్యానికి కొత్త బలం ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల విస్తరణ

**కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక పర్యవేక్షణతో ఆధునిక వైద్య సేవలకు శ్రీకారం**

**మంత్రుల ప్రత్యేక శ్రద్ధతో సౌకర్యాల విస్తరణ.. ప్రజలకు మరింత చేరువైన నాణ్యమైన వైద్యం**

**త్వరలో ఎంఆర్ఐ సేవలు.. ఇప్పటికే అందుబాటులోకి మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు**

**రోగిని కదిలించాల్సిన అవసరం లేకుండా పడక వద్దే ఎక్స్‌రే**

**కలర్ డాప్లర్, కాంట్రాస్ట్ సీటీ, హెచ్ఆర్ సీటీతో అధునాతన నిర్ధారణ సేవలు**

**మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 16,961 స్కాన్లు.. 546 టిఫ్ఫా స్కాన్లతో గర్భిణులకు ప్రత్యేక భరోసా**

**రేడియాలజీ సేవలకు నిపుణుల బలం.. ఖాళీల భర్తీకి చర్యలు**








**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజా సెప్టెంబర్ 11:**ప్రభుత్వ ఆసుపత్రి అంటే సాధారణ వైద్యం మాత్రమే అనే భావనను మార్చేలా ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్య సేవలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఆధునిక వైద్య పరీక్షలు, అధునాతన స్కానింగ్ సదుపాయాలు, రేడియాలజీ సేవలు, మాతా శిశు సంరక్షణ, అత్యవసర రోగులకు పడక వద్దే పరీక్షలు వంటి అనేక సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం మరింత చేరువవుతోంది. ఖరీదైన పరీక్షల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే అనేక ఆధునిక సేవలు అందుతున్నాయి.

జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆసుపత్రిలోని అవసరాలను గుర్తించడం, వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకు రావడం, వాటికి అవసరమైన మౌళిక వసతులు కల్పించడం, వైద్య నిపుణుల కొరతను అధిగమించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల విస్తరణకు రాష్ట్ర మంత్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల బలోపేతానికి మరింత ఊతం లభిస్తోంది.

మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి:

ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి కొత్తగా 3 పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అవసరమైన రోగులకు వేగంగా అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితిని బట్టి పరీక్షలు నిర్వహించేందుకు ఈ పోర్టబుల్ యంత్రాలు ఎంతోఉపయోగపడుతున్నాయి.

అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి తరలించాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, వైద్యుల సూచన మేరకు అవసరమైన ప్రదేశంలోనే పరీక్ష నిర్వహించే వెసులుబాటు ఏర్పడుతోంది.

త్వరలో ఎంఆర్ఐ.. కలెక్టర్ చొరవతో సివిల్ పనులు వేగవంతం:

ఖమ్మం సర్వజనాసుపత్రిలో త్వరలో ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి రానుంది. ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవతో వేగంగా పూర్తి చేస్తున్నారు. ఎంఆర్ఐ యంత్రానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యంత్రం ఏర్పాటు చేసిన తర్వాత అది నిరంతరాయంగా ప్రజలకు సేవలందించేలా అవసరమైన మౌళిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేస్తున్నారు.

మెదడు, వెన్నెముక, కీళ్లు, కండరాలు, అంతర్గత అవయవాలు, తదితర ప్రాంతాలకు సంబంధించిన అనేక సమస్యలను గుర్తించడంలో ఎంఆర్ఐ పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సేవ అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు అధిక వ్యయంతో కూడిన ప్రైవేటు పరీక్షల భారం తగ్గనుంది.

పడక వద్దే ఎక్స్‌రే.. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి ఉపశమనం

సర్వజనాసుపత్రిలో పోర్టబుల్ ఎక్స్‌రే, స్థిర ఎక్స్‌రే సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఓపీ, ఐపీ రోగులకు అవసరాన్ని బట్టి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం అందుబాటులో ఉండటం వల్ల కదలలేని రోగులను పడక నుంచి ఎక్స్‌రే విభాగానికి తీసుకెళ్లాల్సిన అవసరం తగ్గింది. రోగిని పడకపైనే ఉంచి అవసరమైన సమయంలో అక్కడికక్కడే ఎక్స్‌రే తీసే సదుపాయం ఏర్పడింది.

తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, అత్యవసర చికిత్స పొందుతున్నవారు, కదలడానికి ఇబ్బంది ఉన్న రోగులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా మారింది. రోగిని తరలించే సమయంలో కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంతో పాటు వైద్యులకు త్వరగా పరీక్షా ఫలితాలు అందే అవకాశం ఏర్పడింది. అదనంగా ఓపీ, ఐపీ సేవలకు ఎక్స్‌రే యంత్రాలను వినియోగిస్తున్నారు. టీ–హబ్‌లో అదనపు ఎక్స్‌రే యంత్రంతో పాటు మామోగ్రఫీ, స్కానింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు.

జనవరి--ఆగస్టులో 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు

ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అల్ట్రాసౌండ్ సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించారు.

జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, అత్యవసర తదితర విభాగాలకు వచ్చే రోగులకు అవసరాన్ని బట్టి అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జూలైలో 1,977, ఆగస్టులో 1,943 స్కాన్లు నిర్వహించడం ద్వారా సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్న విషయం స్పష్టమవుతోంది.

మాతా శిశు సంరక్షణలో 16,961 స్కాన్లు

గర్భిణీలు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు ఖమ్మం మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 16,961 స్కాన్లు నిర్వహించారు. వీటిలో 8,945 ఓబీజీ స్కాన్లు , 5,417 ఉదర భాగం స్కాన్లు , 546 టిఫ్ఫా స్కాన్లు, 2,053 చిన్నారుల స్కాన్లు ఉన్నాయి.

నెలవారీగా పరిశీలిస్తే ఓబీజీ స్కాన్లు జనవరిలో 910 నుంచి ఆగస్టులో 1,329కు పెరిగాయి. ఉదర భాగం స్కాన్లు జనవరిలో 455 ఉండగా జూలైలో 999కు చేరాయి. చిన్నారులకు నిర్వహించిన స్కాన్లు ఆగస్టులో 388కు చేరాయి. ఇది మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పరీక్షా సేవల వినియోగం పెరుగుతున్నదానికి నిదర్శనంగా నిలుస్తోంది.

గర్భంలోని శిశువు ఆరోగ్యం ముందుగానే తెలుసుకునే అవకాశం

మాతా శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణీల కోసం ప్రత్యేకంగా టిఫ్ఫా స్కాన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గర్భధారణలో సాధారణంగా ఐదు నుంచి ఆరో నెల మధ్య నిర్వహించే ఈ పరీక్ష ద్వారా గర్భంలోని శిశువు అవయవాల నిర్మాణం, అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితిని ముందుగానే పరిశీలించే అవకాశం ఉంటుంది. పిండంలో అవయవ లోపాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ముందుగానే వైద్య ప్రణాళిక రూపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది.

ప్రైవేటు వైద్య కేంద్రాల్లో సాధారణంగా సుమారు రూ. 6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చయ్యే ఈ తరహా సేవను ప్రభుత్వ వైద్య వ్యవస్థలో ఉచితంగా అందించడం గర్భిణీలకు ఎంతో ప్రయోజనకరం. టిఫ్ఫా స్కాన్ల సంఖ్యలోనూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఫిబ్రవరిలో 19 గా ఉన్న స్కాన్లు , ఆగస్టులో 136కు చేరాయి. జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 546 టిఫ్ఫా స్కాన్లు నిర్వహించారు.

కలర్ డాప్లర్‌తో రక్తనాళాల సమస్యలకు ముందస్తు గుర్తింపు

సర్వజనాసుపత్రిలో కలర్ డాప్లర్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. రక్త నాళాల్లో రక్తప్రసరణను పరిశీలించడం, రక్త నాళాల్లో ఏర్పడే అడ్డంకులను గుర్తించడం వంటి వాటికి ఈ పరీక్ష ఉపయోగపడు తుంది. రక్తనాళాల్లో కొవ్వు నిల్వలు లేదా ఇతర కారణాలతో ఏర్పడే అడ్డంకులను గుర్తించేందుకు కలర్ డాప్లర్ సహాయపడు తుంది. డీప్ వీన్ థ్రాంబోసిస్, సిరలకు సంబంధించిన సమస్యలు, ధమనుల్లో రక్తం గడ్డకట్టడం వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుంది.

సకాలంలో వ్యాధిని గుర్తించి అవసరమైన వైద్య చికిత్స లేదా శస్త్రచికిత్స అందించడం ద్వారా చేతులు, కాళ్లకు కలిగే నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుంది.

ప్రైవేటు వైద్య కేంద్రాల్లో ఒక్కో పరీక్షకు సుమారు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు ఖర్చయ్యే సేవను ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురావడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతోంది.

కాంట్రాస్ట్ సీటీ.. హెచ్ఆర్ సీటీ సేవలు:

సర్వజనాసుపత్రిలో కాంట్రాస్ట్ సీటీ స్కాన్ సేవలు నిరంతరాయంగా అందిస్తున్నారు. పగలు, రాత్రి మూడు షిఫ్టుల్లో సేవలు కొనసాగిస్తూ అవసరమైన రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కణతులు, వివిధ అవయవాల స్థితిగతులు, ప్రమాదాల్లో గాయాల తీవ్రత వంటి అంశాలను తెలుసుకోవడంలో సీటీ స్కాన్ కీలకంగా ఉంటుంది. హెచ్ఆర్ సీటీ స్కాన్ ద్వారా ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులను స్పష్టంగా గుర్తించే అవకాశం ఉంటుంది.

మెదడు సంబంధిత వ్యాధులు, పక్షవాతం, మెదడు కణుతులు, ప్రమాదాల్లో గాయాలు తదితర సమస్యలను గుర్తించడంలో కూడా సీటీ స్కాన్ సేవలు ఉపయోగపడు తున్నాయి. ఈ సేవలు ప్రభుత్వ ఆసుపత్రి లోనే అందుబాటులో ఉండటం వల్ల రోగులు బయటకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతోంది.

రేడియాలజీ సేవలకు నిపుణుల బలం

గతంలో రేడియాలజిస్టుల కొరత కారణంగా రేడియాలజీ సేవల నిర్వహణలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యేవి. సమస్య తీవ్రతను గుర్తించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవ తీసుకుని రేడియాలజీ సేవలను బలోపేతం చేసే చర్యలు చేపట్టారు. ఇటీవల డాక్టర్ సురేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. దీంతో రేడియాలజీ విభాగానికి మరింత నిపుణుల బలం చేకూరింది.

అదే విధంగా అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా, పరిధిలోని వైద్య నిపుణుడు డాక్టర్ మురళీకృష్ణను సర్వజనాసుపత్రికి కేటాయించేలా కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఫలితంగా రేడియాలజీ సేవలు మరింత పటిష్టమై ప్రజలకు నాణ్యమైన నిర్ధారణ సేవలు అందించే అవకాశం ఏర్పడింది.

వైద్య సిబ్బంది ఖాళీల భర్తీకి చర్యలు

ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన మానవ వనరులపై కూడా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసేలా చర్యలు చేపట్టారు. వైద్య పరికరాలు అందుబాటులో ఉండటంతో పాటు వాటిని సమర్థవంతంగా వినియోగించేందుకు అవసరమైన వైద్య నిపుణుల సేవలు కూడా అందుబాటులోకి రావడం ద్వారా ఆసుపత్రి వైద్య సామర్థ్యం మరింత పెరుగుతోంది.

పరికరం రావడమే కాదు.. నిరంతర సేవలు అందించడమే లక్ష్యం

కొత్త వైద్య పరికరాలు అందుబాటులోకి రావడం ఒక దశ మాత్రమే. వాటిని ప్రజలకు నిరంతరం ఉపయోగపడేలా చేయడం మరింత ముఖ్యమైన అంశం. ఈ దిశగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

యంత్రాల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులు, విద్యుత్ సదుపాయాలు, వైద్య నిపుణుల అందుబాటు, సిబ్బంది ఖాళీల భర్తీ వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో ఆసుపత్రిలో వైద్య పరికరాలు అందుబాటు లో ఉండటమే కాకుండా వాటి ద్వారా ప్రజలకు నిరంతర సేవలు అందే పరిస్థితి ఏర్పడుతున్నది.

పేదలకు ఆర్థిక భారం తగ్గిస్తూ.. నాణ్యమైన వైద్యం:

అత్యాధునిక పరీక్షలు అందుబాటులోకి రావడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఆర్థిక భరోసా లభిస్తోంది. అల్ట్రాసౌండ్, కలర్ డాప్లర్, సీటీ స్కాన్, హెచ్ఆర్ సీటీ, మామోగ్రఫీ, టిఫ్ఫా వంటి అనేక సేవలు అందుబాటులో ఉండటంతో ఖరీదైన ప్రైవేటు పరీక్షా కేంద్రాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతోంది. గర్భిణీల నుంచి చిన్నారుల వరకు, సాధారణ రోగుల నుంచి అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి వరకు వివిధ వర్గాలకు అవసరమైన వైద్య సేవలను ఒకే ప్రభుత్వ వైద్య వ్యవస్థలో అందించే దిశగా ఆసుపత్రి ముందుకు సాగుతోంది.

ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం

ఆసుపత్రిలో అందుబాటులోకి వస్తున్న కొత్త సేవలను ప్రజలు క్రమంగా వినియోగించు కుంటున్నారు. జనవరి నుంచి ఆగస్టు వరకు అల్ట్రాసౌండ్ సేవల్లో నమోదైన 13,816 పరీక్షలు, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నిర్వహించిన 16,961 స్కాన్లు దీనికి నిదర్శనం.

అత్యాధునిక పరీక్షా సదుపాయాలు, వైద్య నిపుణుల సేవలు, నిరంతర రేడియాలజీ సేవలు, అత్యవసర రోగులకు పడక వద్దే ఎక్స్‌రే వంటి సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతోంది.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు.. ప్రభుత్వ సేవలను వినియోగించుకోండి

ఆరోగ్య సమస్యలు తీవ్రతరం అయ్యే వరకు వేచి చూడకుండా అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. వైద్యుల సూచన మేరకు అల్ట్రాసౌండ్, కలర్ డాప్లర్, సీటీ స్కాన్, హెచ్ఆర్ సీటీ, మామోగ్రఫీ వంటి పరీక్షలను వినియోగించుకోవాలి.

గర్భిణీలు మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అందుబాటులో ఉన్న ఓబీజీ, టిఫ్ఫా, ఇతర స్కానింగ్ సేవలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి. శిశువు ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకుని అవసరమైన వైద్య ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని మరింతగా కాపాడుకోవచ్చు.

ప్రభుత్వ ఆసుపత్రి.. ప్రజల ఆరోగ్యానికి భరోసా

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్య సదుపాయాలు విస్తరిస్తున్నాయి. కొత్త పరికరాలు, అధునాతన పరీక్షలు, నిపుణుల సేవలు, మాతా శిశు సంరక్షణ, అత్యవసర సేవలు ఇలా ప్రతి విభాగంలోనూ సామర్థ్యాన్ని పెంచే చర్యలు కొనసాగుతున్నాయి.

ప్రజలు ఈ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ ఆసుపత్రి మీ ఆరోగ్యానికి అందుబాటులో ఉంది.. ఆధునిక వైద్య సేవలు మీ కోసం అందుతున్నాయి.. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

## కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ తండ్రి సుబ్రహ్మణ్యం ఆత్మహత్యాయత్నం

వరంగల్ మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ తండ్రి సుబ్రహ్మణ్యం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. 40 నిద్రమాత్రలు మింగిన ఆయన శుక్రవారం ఉదయం నిద్ర లేవకపోవడంతో కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే వరంగల్లోని మెడికేర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం సుబ్రహ్మణ్యం పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## కోర్టు కేసులు ఉన్న ప్రైవేటు భూములు మాత్రమే 22ఎ జాబితా లో చేర్చారుఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్

హైదరాబాద్ 22 ఏ పై కేటీఆర్, హరీష్ రావు నిర్లజ్జగా మాట్లాడుతున్నారు . 22ఎ లో అత్యధికంగా భూమి చేర్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అయన మీడియాతో మాట్లాడుతూ మీ భాగోతం బయటపెడుతాం... తొందర ఎందుకు కేటీఆర్. 22ఎ లో ఉన్న భూముల్లో అత్యధికంగా అటవీ, ఇతర ప్రభుత్వ భూములే ఉన్నాయి.. కోర్టు కేసులు ఉన్న ప్రైవేటు భూములు మాత్రమే 22ఎ జాబితా లో చేర్చారని అన్నారు. మహిళా కమిషన్ సీరియస్ గా తీసుకుని అసెంబ్లీ ముందు జరిగిన ఘటన పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు.

# రైతు కోరుకున్న పనిముట్టు.. నచ్చిన కంపెనీ నుంచే కొనుగోలు చేసుకునేలా యాంత్రీకరణ పథకం

### సబ్సిడీ సొమ్ము నేరుగా రైతుఖాతాకే బదిలీ
### రైతుల డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం పెద్దపీట: మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
### మండలిలో మంత్రి తుమ్మల సమాధానం

రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ యంత్ర పరికరాలు అందించడంతో పాటు, వారి అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.

**నాణ్యతకు ప్రాధాన్యత.. పరీక్షించిన యంత్రాలే రైతులకు సరఫరా...**

యాంత్రీకరణ పథకం కింద రైతులకు నాణ్యమైన, ప్రమాణాలు కలిగిన వ్యవసాయ యంత్ర పరికరాలను మాత్రమే అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తయారీదారులు, సరఫరాదారులు అందించే ఉత్పత్తులను ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్స్టిట్యూట్ లేదా కేంద్ర వ్యవసాయ శాఖ (DA&FW) ద్వారా గుర్తింపు పొందిన సంస్థల వద్ద పరీక్షించిన తర్వాతనే రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతుల భద్రత, యంత్రాల నాణ్యత, పనితీరు వంటి అంశాల్లో ఎలాంటి రాజీ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**గతంలో ఉన్న సమస్యలకు ఇక తావులేదు...**

యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించే పరికరాలు వారు కోరుకున్న విధంగా లభించడం లేదని, సబ్సిడీపై అందించే యంత్రాలకు, మార్కెట్లో లభించే యంత్రాలకు తేడా ఉంటుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రస్తావించారు. సబ్సిడీ పరికరాలకు ఇచ్చే కొటేషన్ ధరలు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం ఉంటోందని పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న యంత్రాలను ఎక్కువగా అందించాలని, డ్రోన్లను కూడా అధిక సంఖ్యలో అందించాలని కోరారు.

దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ, ఎమ్మెల్సీ ప్రస్తావించిన అంశాలు గతంలో ఉన్న పరిస్థితులకు సంబంధించినవని, ప్రస్తుతం ఆ విధానం లేదని స్పష్టం చేశారు. రైతులు తమకు నచ్చిన పనిముట్టును, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా ప్రస్తుత యాంత్రీకరణ విధానాన్ని రూపొందించామని తెలిపారు.

**గత ప్రభుత్వం పథకాన్ని నిలిపివేసింది...**

గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను వినియోగించుకోకుండా యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసిందని మంత్రి తుమ్మల తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి తిరిగి అమలులోకి తీసుకొచ్చిందన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం ద్వారా రైతులపై శారీరక శ్రమ తగ్గడంతో పాటు, సాగు ఖర్చులు తగ్గి, సమయానికి వ్యవసాయ పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

**రూ.63.11 కోట్లతో 15,565 యంత్ర పరికరాల సరఫరా...**

2025–26 ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకం కోసం ప్రభుత్వం రూ.71 కోట్లు కేటాయించగా, రూ.63.11 కోట్లు ఖర్చు చేసి 15,565 వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి వివరించారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకానికి రూ.147.91 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతుల డిమాండ్‌ను అనుగుణంగా, అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలను యాంత్రీకరణ పథకం కింద సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీ...**

యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు అందించే పరికరాలపై ప్రభుత్వం గణనీయమైన సబ్సిడీని అందిస్తోందని మంత్రి తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు రైతులపై పడే ఆర్థిక భారం తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు.

**ఎంప్యానెల్‌మెంట్‌లో రైతులకు భాగస్వామ్యం...**

రైతులు కోరుకునే విధంగా వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండేలా ఎంప్యానెల్‌మెంట్ కమిటీలో రైతులకు కూడా భాగస్వామ్యం కల్పించినట్లు మంత్రి తెలిపారు. కమిటీలో శాస్త్రవేత్తలు, టెక్నికల్ ఇంజనీర్లు, అధికారులతో పాటు ఆదర్శ రైతులు, ఎఫ్‌పీవోలు (ఫ్రీూం) ప్రతినిధులను కూడా భాగస్వాములను చేశామని వివరించారు. రైతుల వాస్తవ అవసరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, వివిధ ప్రాంతాల్లో సాగు విధానాలను పరిగణనలోకి తీసుకుని యంత్ర పరికరాల ఎంపిక జరిగేలా ఈ విధానం రూపొందించామని తెలిపారు.

యాంత్రీకరణ పథకం కింద పరికరాలను సరఫరా చేసేందుకు 444 కంపెనీలు ఎంప్యానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నాయని మంత్రి వెల్లడించారు. అయితే ప్రతి కంపెనీని ఎంపిక చేయడం జరగదని, నిర్దేశిత ప్రమాణాలను పాటించే కంపెనీలను, కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంబంధిత సంస్థలు గుర్తించి ఎంపిక చేసే ప్రమాణాలను అనుసరించే కంపెనీలను మాత్రమే జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు.

దీంతో రైతులకు నాణ్యత లేని లేదా ప్రమాణాలు లేని యంత్ర పరికరాలు అందకుండా చూడటంతో పాటు, నాణ్యమైన ఉత్పత్తులకు ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు.

**రైతుకే పూర్తి స్వేచ్ఛ.. నచ్చిన కంపెనీ నుంచే కొనుగోలు...**

యాంత్రీకరణ పథకంలో రైతుకు కొనుగోలు విషయంలో పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. రైతు తనకు నచ్చిన పనిముట్టును, తనకు నచ్చిన కంపెనీ దగ్గరే కొనుగోలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

ప్రభుత్వం రైతుల తరఫున ఒక నిర్దిష్ట కంపెనీ నుంచి మాత్రమే యంత్రాన్ని కొనుగోలు చేయాలని నిర్దేశించడం లేదన్నారు. అదేవిధంగా, రైతులు మార్కెట్లో అందుబాటులో ఉన్న ప్రమాణాలకు అనుగుణమైన తమకు నచ్చిన పరికరాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు.

**సబ్సిడీ నేరుగా రైతు ఖాతాలోకి...**

యాంత్రీకరణ పథకంలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రైతులకు అందాల్సిన సబ్సిడీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నామని చెప్పారు. దళారులకు, మధ్యవర్తులకు అవకాశం లేకుండా రైతుకు నేరుగా ప్రయోజనం అందేలా వ్యవస్థను రూపొందించామని తెలిపారు. రైతు తన అవసరానికి అనుగుణంగా పరికరాన్ని ఎంపిక చేసుకుని కొనుగోలు చేసుకునే అవకాశం ఉండటంతో పాటు, సబ్సిడీ కూడా నేరుగా రైతు ఖాతాలో జమ కావడం ద్వారా పథకం అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు.

**రైతుల డిమాండ్‌కు అనుగుణంగా యంత్రాల సరఫరా...**

రాష్ట్రంలో పంటల సాగు విధానాలు, రైతుల అవసరాలలో ఉండే అసమానతల వలన, యాంత్రీకరణకు ఉన్న డిమాండ్ ప్రాంతాల వారిగా భిన్నంగా ఉంటుందని మంత్రి తెలిపారు. అందువల్ల రైతులకు అవసరం లేని పరికరాలను పెద్ద ఎత్తున సరఫరా చేయడం కాకుండా, రైతుల నుంచి వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన యంత్రాలను అందుబాటులోకి ఉంచుతున్నామని స్పష్టం చేశారు.

డ్రోన్లు సహా ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరికరాలకు పెరుగుతున్న డిమాండ్‌ను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోందన్నారు.

**ఆయిల్‌పామ్ సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం...**

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.50 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, వచ్చే మూడు సంవత్సరాల్లో మరో 6 లక్షల ఎకరాలను ఆయిల్‌పామ్ సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అనుగుణంగా రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను కూడా యాంత్రీకరణ పథకం కింద అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్న అత్యుత్తమ యంత్ర పరికరాలను గుర్తించి, అవసరమైన వాటిని దిగుమతి చేసుకుని రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

ఈ యంత్ర పరికరాలను ఫ్యాక్టరీ వద్దే రైతులకు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. తద్వారా



ఆయిల్‌పామ్ సాగులో యాంత్రీకరణ పెంచి, రైతుల శ్రమను తగ్గించడంతో పాటు ఉత్పాదకతను పెంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**రైతు ప్రయోజనమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..**

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, రైతుల శ్రమను తగ్గించడం, సాగు ఖర్చులను తగ్గించడం, వ్యవసాయ పనులను సకాలంలో పూర్తి చేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు యాంత్రీకరణ కీలకమని మంత్రి తుమ్మల అన్నారు.

రైతులకు అవసరమైన పరికరాలను వారి డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, నాణ్యత విషయంలో రాజీ పడకుండా, సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తూ పారదర్శకమైన, రైతు కేంద్రిత యాంత్రీకరణ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

రైతు ఏ పనిముట్టు కోరుకుంటున్నాడో, ఏ కంపెనీ పరికరం తనకు అనుకూలంగా ఉంటుందో నిర్ణయించుకునే స్వేచ్ఛ రైతుకే ఉండేలా ప్రభుత్వం విధానాలను రూపొందించిందని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆధునిక యాంత్రీకరణను మరింత విస్తరించి, రాష్ట్ర రైతాంగానికి మరింత ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు.

## మల్లికార్జున ఖర్గేను కలిసిన మధుయాష్కి గౌడ్

### AIPC చైర్ పర్సన్ గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపిన మధుయాష్కి గౌడ్



ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్ గా నియమితులైన మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ ఈ రోజు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ని బెంగళూరులోని వారి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఖర్గే కి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించిన మధుయాష్కి . తనపై ఎంతో నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత అప్పగించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వివిధ రంగాల్లోని వృత్తి నిపుణులు, మేధావులను కాంగ్రెస్ పార్టీకి అనుసంధానం చేస్తూ.. వారందరినీ జాతీయస్థాయిలో ఒక వేదికపై తీసుకువచ్చే గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఖర్గే మధుయాష్కి కి దిశానిర్దేశం చేశారు.

### కోకాపేట రియల్ ఎస్టేట్
### అంతలో ఎంత మార్పు.. రివర్స్ గేర్...

హైదరాబాద్, సెప్టెంబర్ 11, కోకాపేట నియోపోలిస్‌లో 4.59 ఎకరాల ప్లాట్‌కు హెచ్‌ఎండీఏ నిర్వహించిన ఆన్‌లైన్ వేలానికి ఆశించిన స్పందన రాలేదు. కేవలం ఒక్క బిడ్ దాఖలవడంతో ఎకరాకు రూ.120 కోట్ల కనీస ధరకే ప్లాటు అమ్ముడుపోయింది. గత వేలంలో ఇదే భూమికి ఎకరాకు రూ.136 కోట్లు పలికినా.. బిడ్డర్ గడువులోపు డబ్బు చెల్లించకపోవడంతో మళ్లీ వేలం నిర్వహించారు. మరోవైపు గోల్డెన్ మైల్‌లోని 0.70 ఎకరాల ప్లాటుకు మాత్రం పోటీ పెరిగి ఎకరాకు రూ.115 కోట్ల అత్యధిక బిడ్ నమోదైంది.హైదరాబాద్‌లో అత్యంత విలువైన కోకాపేట భూముల ఆన్‌లైన్ వేలం హెచ్‌ఎండీఏకు నిరాశను కలిగించింది. ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని అందించలేకపోయింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట నియోపోలిస్‌లోని సర్వే నంబర్లు 239, 240లో 4.59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్ నంబర్ 17కు బుధవారం నిర్వహించిన వేలంలో కేవలం ఒక్క బిడ్ మాత్రమే దాఖలైంది. దీంతో పోటీ లేకపోవడంతో కనీస ధర అయిన ఎకరాకు రూ.120 కోట్లకే ప్లాటు దక్కింది. ఈ ప్లాటు ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.550.8 కోట్ల ఆదాయం సమకూరనుంది. అయితే గతంలో ఇదే ప్లాటుకు నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ.136 కోట్ల ధర పలికింది. అత్యధిక ధరకు బిడ్ దాఖలు చేసిన సంస్థ గడువులోగా నిర్ణీత మొత్తాన్ని చెల్లించకపోవడంతో ఆ లావాదేవీ నిలిచిపోయింది. దీంతో హెచ్‌ఎండీఏ తాజాగా మరోసారి వేలం నిర్వహించింది. ఈసారి పోటీ బిడ్లు లేకపోవడంతో గతంలో నమోదైన ధరతో పోలిస్తే తక్కువ మొత్తానికే భూమి అమ్ముడుపోయింది.కోకాపేటకు సమీపంలోని గోల్డెన్ మైల్ సైట్–1లో 0.70 ఎకరాల భూమికి మాత్రం వేలంలో మంచి స్పందన లభించింది. సర్వే నంబర్ 109లోని ఈ ప్లాటుకు హెచ్‌ఎండీఏ కనీస ధరను ఎకరాకు రూ.70 కోట్లుగా నిర్ణయించింది. అయితే వేలంలో పోటీ పెరగడంతో అత్యధిక బిడ్ ఎకరాకు రూ.115 కోట్లకు చేరింది. దీంతో ఈ ప్లాటుకు నిర్ణయించిన కనీస ధర కంటే గణనీయంగా ఎక్కువ ధరకు అమ్ముడుపోయింది. ఒకే ప్రాంతంలో ఉన్న భూములకు వేలంలో భిన్నమైన స్పందన రావడం ఆసక్తికరంగా మారింది. కోకాపేట నియోపోలిస్‌లోని భారీ ప్లాటుకు ఒక్క బిడ్ మాత్రమే రావడం, గోల్డెన్ మైల్ ప్లాటుకు మాత్రం పోటీ నెలకొనడం మార్కెట్ పరిస్థితులపై చర్చకు దారితీసింది.ఈ రెండు ప్లాట్లు కోకాపేటలో వ్యూహాత్మక ప్రదేశాల్లో ఉన్నాయని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, హైటెక్‌సిటీ ప్రాంతాలకు వీటికి మెరుగైన రహదారి అనుసంధానం ఉందని చెప్పారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పశ్చిమ హైదరాబాద్‌లో కోకాపేట కీలక వాణిజ్య, నివాస కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో ఇక్కడి భూములకు భారీ డిమాండ్ ఉందని అన్నారు.

## పర్యావరణ హితం..
## విద్యార్థుల చేతుల మీదుగా మట్టి గణపతులు

### మట్టి వినాయకులనే పూజిద్దాం.
### మాస్టర్ మైండ్స్ ప్రిన్సిపాల్ శామ్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ 11 ,(ప్రజాబలం ప్రతినిధి)**పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని సుభాష్‌నగర్‌లోని మాస్టర్ మైండ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ శామ్ పిలుపునిచ్చారు. పాఠశాలలో మట్టి గణపతులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వయంగా మట్టి ప్రతిమలను తయారు చేయించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ), రసాయన రంగులతో కూడిన విగ్రహాల నిమజ్జనం వల్ల చెరువులు, నదులు విషతుల్యమై జలచరాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతికి హాని కలిగించని పండుగలను జరుపుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే స్వయంగా మట్టి విగ్రహాల తయారీ చేపట్టామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మైలార్ దేవ్ పల్లి పరిధిలో విషాదం
### వేడి నీళ్ల బకెట్లో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి .

**రాజేంద్రనగర్ ప్రజాబలం ప్రతినిధి:** రాజేంద్రనగర్ మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వేడి నీళ్ల బకెట్లో పడి నాలుగేళ్ల బాలిక మృతి చెందింది స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ మహబూబ్నగర్ జిల్లాకు చెందిన ఒక కుటుంబం ఉపాధి నిమిత్తం ప్రగతి నగర్లో నివాసముంటోంది. ఓ కంపెనీలో పనిచేసే బాలిక తల్లి, పని ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత స్నానం చేయడానికి బకెట్లో వాటర్ హీటర్ పెట్టి నీళ్లను వేడి చేస్తోంది అదే సమయంలో తల్లికి ఫోన్ రావడంతో బయటికి వెళ్లింది అక్కడే ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారి మానస ప్రమాదవశాత్తూ వేడి నీళ్ల బకెట్లో పడిపోయింది. నీళ్ల వేడికి తీవ్రంగా గాయపడిన చిన్నారిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పాప మృతి చెందింది. ఈ ఘటనపై మైలార్ దేవ్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## NOTICE OF THE 84TH ANNUAL GENERAL MEETING

NOTICE IS HEREBY GIVEN that, with the requisite consent of the Members for shorter notice, the 84th Annual General Meeting of the Members of M/s Hyderabad Chemicals Pharmaceuticals Works Limited will be held on September 16, 2026 at 10:30 A.M. at Hotel Kinara Grand, 4-7-119/5/1, Main Road, Opposite CCMB, Habsiguda X Roads, Hyderabad, Telangana - 500007, to transact the following business:

**ORDINARY BUSINESS**

1. Adoption of Financial Statements

To receive, consider and adopt the Audited Financial Statements of the Company for the financial year ended March 31, 2026, together with the Reports of the Board of Directors and Auditors thereon.

"RESOLVED THAT the Audited Financial Statements of the Company for the financial year ended March 31, 2026, together with the Reports of the Board of Directors and Auditors thereon, be and are hereby received, considered and adopted."

SPECIAL BUSINESS

2. Future Course of Action of the Company

To consider and, if thought fit, to pass the following resolution:

"RESOLVED THAT the consent of the Members be and is hereby accorded to the Board of Directors to consider and evaluate the future course of action of the Company, including the possibility of closure or winding up, subject to applicable laws and necessary approvals.

RESOLVED FURTHER THAT the Directors be and are hereby authorized to take such preliminary steps and obtain professional advice as may be necessary in this regard.

RESOLVED FURTHER THAT no formal winding-up or voluntary liquidation proceedings shall be deemed to have commenced pursuant to this resolution."

EXPLANATORY STATEMENT - ITEM NO. 2

1. The Company is presently not carrying on any business operations. The Board is considering the future course of action of the Company, including the possibility of eventual closure or winding up, subject to applicable laws and approvals.

No formal action towards closure, winding up or voluntary liquidation has been initiated as at the date of this Notice.

None of the Directors or Key Managerial Personnel is concerned or interested in the resolution, except to the extent of their shareholding, if any.

NOTES

1. A Member entitled to attend and vote is entitled to appoint a proxy to attend and vote on his/her behalf. The proxy need not be a Member.
2. The Proxy Form, duly completed and signed, should be deposited at the Registered Office of the Company at least 48 hours before the Meeting.
3. The AGM is being convened at shorter notice with the requisite consent of the Members.

By Order of the Board
For M/s HYDERABAD CHEMICALS AND PHARMACEUTICAL WORKS LIMITED

PANKAJ BALDAWA — KRISHNA KUMAR BALDAWA
DIN-05309795 — DIN-02763290
Date: 09/09/2026;Place: Hyderabad


# అసెంబ్లీలో రోజుకు రూ.8?12 లక్షల ఖర్చు.

హైదరాబాద్, సెప్టెంబర్ 11, తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు.. 6 రోజులు నిర్వహించాలని నిర్ణయించారు. అంటే.. ఈ గురు, శుక్ర, శనివారంతో ఈ సభలకు ముగింపు పలకనున్నారు. కీలకమైన బిల్లులను ఈ సభలో ప్రవేశ పెట్టి ఆమోదించుకోవాలని ప్రభుత్వం పక్షం నిర్ణయించుకుంది. అలాగే.. వెయ్యిరోజుల పాలన పై కూడా చర్చించి.. ప్రజలకు ఏయే మేళ్లు చేశారు.. ఏమేరకు రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు.. అనే విషయాలను కూడా వివరించాలని నిర్ణయించారు. అజెండాలోనూ వీటిని పేర్కొన్నారు.ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ విషయానికి వస్తే.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను.. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, హైడ్రా కమిషనర్ వ్యవహారం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఎల్ నినో ప్రభా వం సహా.. ఇతర అంశాలను కూడా ప్రస్తావించాలని నిర్ణయించుకుంది. తద్వారా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని తొలుత నిర్ణయించింది. కానీ, అనూహ్యంగా అసెంబ్లీ వాతావరణమే మారిపోయింది. మూడు రోజుల అసెంబ్లీలో ఒక్కటంటే ఒక్క సమస్య కూడా ప్రస్తావనకురాలేదు. అటు అధికార పక్షం, ఇటు ప్రధాన ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగు కోవడమే సరిపోయింది. అసెంబ్లీ తొలి రోజు సోమవారం.. వెయ్యి రోజుల పాలనలో ఏమీ జరగలేదని చెబుతూ.. నల్ల టీషర్టులు ధరించి నిరసన వ్యక్తం చేయడం నుంచి స్పీకర్‌పై బీఆర్ ఎస్ ఎమ్మెల్సీలు.. చేసిన వ్యాఖ్యలు సభను కుదిపి వేశాయి. పోనీ రెండో రోజైనా సర్దుకున్నాయా? అంటే.. లేదు. ఎమ్మెల్సీల వ్యవహారం.. ఇరుపక్షాల మాటల దాడితోనే సభా సమయం కరిగిపోయింది బీఆర్ ఎస్ ఎమ్మెల్యేల పై కాంగ్రెస్ పార్టీ, కాదు.. మీరే మమ్మల్ని అవమానించారని.. మహిళలపైనా దాడులు చేశారని బీఆర్ ఎస్ నేతలు యుద్ధాన్ని తలపించేలా సభలో వాగ్యుద్ధం చేసుకున్నారు. ఫలితంగా.. సభలో రభస తప్ప.. మరేమీ కనిపించలేదు. రోజుకు 8– 12 లక్షల రూపాయల మేరకు ఖర్చు చేస్తున్న సభలో ఒక్క ప్రజా సమస్యపైనా.. నాయకులు నోరు విప్పకపోవడం గమనార్హం. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఎల్ నినో.. రాజధానిలో అడుగంటుతున్న శాంతి భద్రతలు..(డీజీపీ ఆనందే వెల్లడించారు) వంటి అంశాలపై ఒక్కరు సైతం మాట్లాడకపోవడం గమనార్హం. మరి రభస ఎవరి కోసం.. రేపు సభ అయిపోయిన తర్వాత.. ఎవరి మానాన వారు తమ తమ పనుల్లో ఉంటారు. మరి ప్రజా సమస్యలపై చర్చించేది ఎప్పుడు? అనేది ధర్మసందేహం.!

# కొండా దెబ్బకు రాజ్ గోపల్ రెడ్డి యూ టర్న్..

హైదరాబాద్, సెప్టెంబర్ 11, తెలంగాణ కాంగ్రెస్‌లో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తరచుగా మీడియాలో ఉంటున్నారు. తనకు మంత్రి పదవి దక్కలేదని ఆక్రోశిస్తున్న ఆయన.. దానిని ఎలాగైనా సాధించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. అయితే.. ఈ క్రమంలో ఆయన సామ, దాన, బేధ, దండోపాయాల్లో కుదిరిన సమయం లో కుదిన దానిని వినియోగిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు బేధోపాయాన్ని(వైరం) అనుసరించారు. సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారుమునుగోడులో సొంత అధికారం చలాయిస్తున్నారు. బెల్టు షాపులు నిర్వహించేది లేదన్నారు బాగానే ఉంది. కానీ.. ప్రభుత్వం ఇచ్చే లైసెన్సులు తెచ్చుకున్న మద్యం దుకాణాలపైనా ఆయన ఆంక్షలు పెట్టారు. అధికారులపై చిందులు తొక్కారు. కానీ, తాజాగా ఇప్పుడు రూటు మార్చేశారు. తాజా మాజీ మంత్రి కొండా సురేఖపై పార్టీ వ్యవహరించిన తీరుతో కంగుతిన్న రాజగోపాల్ రెడ్డి ఏకంగా సామ మార్గం(బుజ్జగించడం)పట్టారు.. అబ్బే నేను సీఎం ను ఏమీ అనలేదని.. అదంతా తనంటే గిట్టని ఓ మీడియా చేసిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌తో తనకు ఎప్పుడూ ఎలాంటి పేచీ పంచాయితీలు లేవని కూడా రాజగోపాల్ వ్యాఖ్యానించారు. అంతే కాదు.. రేవంత్ రెడ్డి వంటి బలమైన నాయకుడి కారణంగానే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని.. మళ్లీ మళ్లీ కాంగ్రెస్ అధికారం లోకి వచ్చినా ఆశ్చర్యం లేదన్నారు. ఇక్కడితో కూడా ఆగకుండా.. మునుగోడు నియోజకవర్గానికి 2 వేల కోట్ల రూపాయల నిధులు కూడా కేటాయించారని.. తద్వారా అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయన్నారు. కానీ, రెండు మాసాల కిందట తన నియోజకవర్గం పాకిస్థాన్‌లో ఏమైనా ఉందా? అని ఇదే రాజగోపాల్ ప్రశ్నించడం గమనార్హం.ఇక, ఇప్పుడు మరో మాట కూడా చెప్పుకొచ్చారు. త్వరలో జరగబోయే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు తన నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని రాజగోపాల్ చెప్పడం గమనార్హం. మొత్తంగా కొండా సురేఖ వ్యవహారం తేలిపోయిన దరమిలా.. నిన్న మొన్నటి వరకు ఎగిరి పడిన చాలా మంది నాయకులు లైన్‌లోకి వచ్చేస్తున్నారు. కొందరు ఇంటి నుంచి బయటకు కూడా రాకపోగా.. మరికొందరు మీడియాకు ముఖం చాటేస్తున్నారు. ఈ జాబితాలో ఇప్పుడు కోమటిరెడ్డి చేరిపోయారు. మరి మున్ముందు.. ఈ శాంతి వచనాలు ఇలానే కొనసాగుతాయో లేదో చూడాలి.

# రామప్పను కబళిస్తున్న మైనింగ్

వరంగల్, సెప్టెంబర్ 11, ములుగు జిల్లాలో ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రాజెక్టుపై స్థానికులు, పర్యావరణవేత్తలు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రఖ్యాతి గాంచిన రామప్ప ఆలయంతో పాటు 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామప్ప చెరువుపై మైనింగ్ ప్రభావం చూపే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ అభ్యంతరాల నేపథ్యంలో ములుగు జిల్లా కలెక్టర్ ప్రతిపాదిత ప్రాజెక్టు జియో ట్యాగింగ్ ప్రక్రియను వాయిదా వేశారు. శాస్త్రీయ, పర్యావరణ అధ్యయనాల అనంతరం నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన తెలంగాణలోని చారిత్రక రామప్ప ఆలయానికి సమీపంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రాజెక్టు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో చేపట్టాలని ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు వల్ల రామప్ప ఆలయంతో పాటు 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామప్ప చెరువుపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు, పర్యావరణవేత్తలు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించి స్థానికులు, పాలంపేట స్పెషల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎస్‌డీఏ) కమిటీ సభ్యులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ (కేహెచ్‌టీ) ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ములుగు జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు భోర్కడే మంగళవారం ప్రతిపాదిత మైనింగ్ ప్రాజెక్టు జియో ట్యాగింగ్ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మైనింగ్ ప్రాజెక్టుపై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ హేమంత్.. శాస్త్రీయ, పర్యావరణపరమైన అంచనాలు పూర్తి అయిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.ఈ అంశంపై నిర్వహించిన సమావేశాల్లో జిల్లా యంత్రాంగంతో పాటు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్–సీసీఎల్), కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, పీఎస్‌డీఏ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రామప్ప ఆలయం , చెరువు, పరిసర గ్రామాలపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారసత్వ పరిరక్షణ వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌ను కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కన్వీనర్, మాజీ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు వ్యతిరేకించారు. గనుల తవ్వకాల కోసం బ్లాస్టింగ్, డ్రిల్లింగ్, భారీ యంత్రాల వినియోగం చేపడితే రామప్ప చెరువు నిర్మాణంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రామప్ప చెరువుకు సుమారు 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని.. దాని నిర్మాణానికి ఏదైనా నష్టం జరిగితే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని పాండురంగారావు పేర్కొన్నారు. చెరువుకు సుమారు 5 కిలోమీటర్ల పరిధిలో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టడం కూడా పలు ప్రమాదాలకు దారితీయవచ్చని.. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని కోరారు.ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు 40.4 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసేందుకు సింగరేణి గతంలో అనుమతులు పొందినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకోసం 19 ఏళ్ల మైనింగ్ లీజు కూడా పొందినట్లు సమాచారం. ప్రాజెక్టు పరిధిలోని కొంత భూమిని సంస్థ ఇప్పటికే సేకరించి.. భూయజమానులకు పరిహారం చెల్లించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ప్రాజెక్టులో సుమారు 314 హెక్టార్ల అటవీ భూమి.. మరో 1,448 హెక్టార్ల వ్యవసాయ, ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉన్నట్లు పేర్కొంటున్నారు. దీంతో మైనింగ్ వల్ల పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధిపై కూడా ప్రభావం ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు 2021 జూలైకి ముందే సమర్పించగా.. అదే ఏడాది డిసెంబర్‌లో మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలనే ప్రణాళిక ఉన్నట్లు సమాచారం. కానీ.. 2021 జూలై 25వ తేదీన రామప్ప ఆలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా లభించింది. దీంతో పాలంపేట, పరిసర గ్రామాల ప్రజలు ఆలయ పరిరక్షణ కోసం సేవ్ రామప్ప ఉద్యమాన్ని ప్రారంభించారు. స్థానికులు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో సింగరేణి ఈ ప్రాజెక్టును అప్పట్లో నిలిపివేసినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టును తిరిగి ముందుకు తీసుకెళ్లే అంశంపైచర్చలు మొదలవడంతో పాలంపేట, పరిసరగ్రామాలప్రజలుమరోసారి ఆందోళనకు సిద్ధమవుతున్నారు.రామప్ప ఆలయం, చెరువు, అటవీ ప్రాంతం, స్థానిక పర్యావరణ వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

# పక్కా వ్యూహంతో కాంగ్రెస్

హైదరాబాద్, సెప్టెంబర్ 11, తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకునే రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ టాప్ లీడర్‌షిప్ నే లక్ష్యంగా చేసుకుంటాయనే విషయం మరోసారి రుజువైంది. గత మూడు రోజులుగా తెలంగాణ శాసనసభ లోపల, బయట చోటుచేసుకున్న రచ్చ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు, అసెంబ్లీ గేట్ వద్ద పోలీసులతో జరిగిన తోపులాటలు కేవలం కొందరు ఎమ్మెల్యేల తొందరపాటు చర్య కాదని సీఎం రేవంత్ శాసనసభ వేదికగా బాంబు పేల్చారు. ఈ మొత్తం హైడ్రామా వెనుక ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వేదికగా జరిగిన నేరపూరిత కుట్ర ఉందంటూ, నేరుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌నే సూత్రధారిగా వేలెత్తి చూపడం ద్వారా గులాబీ దళానికి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు.అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం కేవలం ఒక రాజకీయ విమర్శ మాత్రమే కాదు. దానికి పక్కా లీగల్ అండ్ పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేశారు. సెప్టెంబర్ 6న ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన అంతర్గత సమావేశంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల మార్కును, అసెంబ్లీ సమావేశాలను అడ్డుకోవడానికి ప్లాన్ సిద్ధమైందని రేవంత్ ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత నేతను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, పోలీసుల విధులకు భంగం కలిగించడం వెనుక సభను అస్థిరపరిచే పక్కా వ్యూహం ఉందన్నారు. దీనిని కేవలం సభా నిబంధనల ఉల్లంఘనగా కాకుండా, ఎఖఅ, ఃఔ కింద నేరపూరిత కుట్రగా పరిగణిస్తూ దర్యాప్తుకు ఆదేశించడం కాంగ్రెస్ వేసిన మాస్టర్ స్ట్రోక్.ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం లీగల్‌గా సీరియస్‌గా తీసుకుంది. హైదరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ నేతృత్వంలో విచారణ జరిపించి, ఫామ్‌హౌస్ సమావేశానికి హాజరైన నేతలు, అక్కడి నుంచి వచ్చిన సూచనలు, అసెంబ్లీ వద్ద జరిగిన భౌతిక దాడుల మధ్య ఉన్న లింకులను టెక్నికల్, ఫోరెన్సిక్ ఆధారాలతో సేకరించాలని ఆదేశించారు. సీనియర్ ఐపీఎస్ పర్యవేక్షణలో జరిగే ఈ కుట్ర కోణం దర్యాప్తు.. రేపు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి, విచారణకు పిలిచే వరకూ వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకవేళ కేసీఆర్‌ను లేదా ఆయన ప్రధాన అనుచరులను విచారిస్తే, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడటం ఖాయం.కాంగ్రెస్ సర్కార్ వేసిన ఈ బిగ్ ట్రాప్ నుంచి బయటపడటం బీఆర్ఎస్‌కు అతిపెద్ద సవాలే. బీఆర్ఎస్ ఇప్పటికే ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకు లీగల్ , విక్టిమ్ కార్డ్‌ను వాడుతోంది. అసెంబ్లీ గేట్ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల, సీనియర్ నేతల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై హైకోర్టును, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించి పోలీస్ యంత్రాంగాన్ని రక్షణలో పడేసే ప్రయత్నం చేస్తోంది. రేవంత్ రెడ్డి కావాలనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కేసీఆర్ పేరును లాగుతున్నారని బీఆర్ఎస్ వాదిస్తోంది. రేవంత రెడ్డి ఆడిన ఈ గేమ్‌తో ప్రతిపక్షం అనుకున్న అజెండా పూర్తిగా దారి తప్పింది. కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలు , ఆరు గ్యారెంటీలు అంశాలపై చార్జ్‌షీట్ ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావించిన బీఆర్ఎస్.. ఇప్పుడు కేసీఆర్ కుట్ర – దళిత స్పీకర్‌కు అవమానం అనే కొత్త కాంగ్రెస్ నెరేటివ్‌ను డిఫెండ్ చేసుకునే పనిలో పడింది. కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్సీల సస్పెన్షన్ల చుట్టూ తిరిగిన చర్చను రేవంత్ రెడ్డి ఒక్క దెబ్బతో నేరుగా కేసీఆర్ వర్సెస్ కాంగ్రెస్ సర్కార్ గా మార్చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయాల్లో చిన్న చిన్న నేతలతో కాలక్షేపం చేయకుండా, నేరుగా ప్రధాన ప్రత్యర్థి మూలాలనే దెబ్బకొట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. విచారణ పేరుతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను ఈ కేసులోకి లాగడం ద్వారా బీఆర్ఎస్ అగ్రనాయకత్వాన్ని మానసికంగా, లీగల్‌గా ఒత్తిడికి గురిచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయం సాధించింది. రాబోయే రోజుల్లో ఈ సీనియర్ ఐపీఎస్ విచారణ ఏ మలుపు తిరుగుతుందో, గులాబీ దళం దీనికి ఎలా బదులిస్తుందో వేచి చూడాలి.

## తిరుపతిలో జెన్ జీ ర్యాలీ

తిరుపతి అమరావతికి నైలెట్ తరలింపును నిరసిస్తూ తిరుపతిలో జెన్ జీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి విద్యార్థులు, తిరుపతి నగర ప్రజలు వేలాదిగా తరలి వచ్చారు. కాక్రోచ్ తిరుపతి పేరుతో భారీ ఎత్తున విద్యార్థులు నిరసనకు దిగారు. నైలెట్ తిరుపతి శాశ్వత క్యాంపస్ నిర్మించాలని డిమాండ్ చేసారు. పార్టీలకు అతీతంగా యువత, నగర ప్రజలు, విద్యార్థులు నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. వైసీపీ ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, భూమన అభినయ్ రెడ్డి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ 2వ గేట్ నుంచి మెయిన్ గేట్ వరకు భారీ నిరసన ర్యాలీ కొనసాగింది.

# జాతీయ భద్రత, చట్ట పాలన మరియు ఇస్లామిక్ నీతి-శాస్త్రం. ఉంటాయి

రాజస్థాన్లోని ఇండో-పాక్ సరిహద్దు సమీపంలో కొన్ని మతపరమైన కట్టడాలను కూల్చివేసినట్లు ఇటీవల వచ్చిన నివేదికలు ప్రజా చర్చకు దారితీశాయి. ఇటువంటి పరిణామాలు సహజంగానే తీవ్ర భావోద్వేగాలను రేకెత్తిస్తాయి, ఎందుకంటే స్థలాలు భక్తులకు ప్రగాఢమైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కలిగి అదే సమయంలో, జాతీయ భద్రతను కాపాడటం, చట్టాన్ని అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. ఈ రెండు అంశాలు పరస్పరం సంఘర్షణకు దారితీసినప్పుడు, ఈ సమస్యను రెండింటికీ అనుగుణంగా పరిష్కరించడం చాలా ముఖ్యం. ప్రశాంతంగా, గౌరవప్రదంగా, చట్టపరమైన సూత్రాలు మరియు నైతిక విలువలు ।

ప్రతి దేశానికి తన సరిహద్దులను కాపాడుకోవడం, తన పౌరులను రక్షించడం మరియు ప్రజా శాంతిభద్రతలను పరిరక్షించడం వంటి బాధ్యత ఉంటుంది. జాతీయ భద్రత అనేది ఏ ప్రభుత్వానికైనా ప్రాథమిక బాధ్యతలలో ఒకటి. భద్రత లేకపోతే, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక అవకాశాలు మరియు మత స్వేచ్ఛ వంటి ఇతర హక్కులను ప్రజలు అనుభవించడం కష్టమవుతుంది. అందుకే, ప్రజా భద్రత, జాతీయ భద్రత లేదా ప్రజా శాంతిభద్రతల కోసం అవసరమైనప్పుడు, రాజ్యాంగాలు మరియు న్యాయ వ్యవస్థలు తరచుగా వ్యక్తిగత హక్కులపై సహేతుకమైన పరిమితులను అనుమతిస్తాయి. అయితే అటువంటి చర్యలు చట్టానికి అనుగుణంగా తీసుకున్నదై ఉండాలి. ఇస్లాం క్రమం, న్యాయం మరియు చట్టబద్ధమైన అధికారం యొక్క ప్రాముఖ్యతను కూడా గుర్తిస్తుంది. ఖురాన్ ఇలా చెబుతుంది, "ఓ విశ్వాసులారా! అల్లాహు విధేయులుగా ఉండండి. ప్రవక్తకు మరియు మీలో అధికారంలో ఉన్నవారికి విధేయులుగా ఉండండి (సూరా అన్-నిసా । 4:59)". ప్రజా పరిపాలన విషయాలలో చట్టబద్ధమైన అధికారానికి విధేయత చూపడం సామాజిక క్రమాన్ని కాపాడటానికి సహాయపడుతుందని ప్రాచీన ఇస్లామిక్ పండితులు వివరించారు. ఇస్లాం న్యాయానికి మరియు సక్రమమైన ప్రక్రియకు మరింత ప్రాధాన్యత ఇస్తుంది. ఖురాన్ ఇలా పేర్కొంటుంది; "ఓ విశ్వాసులారా! అది మీకు లేదా మీ తల్లిదండ్రులకు మరియు బంధువులకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, అల్లాహ్ కొరకు సాక్షులుగా న్యాయం కోసం దృఢంగా నిలబడండి (సూరా అన్-నిసా 4:135)". భావోద్వేగం లేదా వ్యక్తిగత ప్రాధాన్యతల మీద కాకుండా, సాక్ష్యాలు మరియు న్యాయం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని ఈ వచనం ముస్లింలకు గుర్తు చేస్తుంది.ఇస్లాం చరిత్ర అంతటా, ఒక మసీదు యొక్క పవిత్రత అది పాపించబడిన చట్టబద్ధమైన పద్ధతితో సన్నిహితంగా ముడిపడి ఉంటుందని పండితులు నొక్కి చెప్పారు. ఇతరులకు చెందిన భూమిపై వారి అనుమతి లేకుండా గానీ, లేదా వివాదాస్పద ఆస్తిపై గానీ మసీదును నిర్మించడం అనేది ఇస్లాం సమర్థించే న్యాయ సూత్రాలకు సాధారణంగా విరుద్ధంగా పరిగణించబడింది. పవక ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా ఇతరుల హక్కులను గౌరవించాలని బోధించారు. ఆయన ఇలా అన్నారు, "ఎవరైనా ఇతరుల భూమిలో కొంత కొంత భాగాన్ని అన్యాయంగా తీసుకుంటే అతను పునరుతాన దినాన ఏడు భూలోకాలలోకి కుంగిపోతాడు (సహీహ్ అల్-బుఖారీ 2454)". ఈ హదీస్, ఇస్లాం ఆస్తి హక్కులను ఎంత తీవ్రంగా పరిగణిస్తుందో తెలియజేస్తుంది.

భూ యాజమాన్యానికి సంబంధించిన కేసులను న్యాయస్థానాలు విచారించేటప్పుడు. పత్రాలు, రికార్డులు, సాక్షుల వాంగ్మూలాలు మరియు వర్తించే చట్టాలను పరిశీలిస్తాయి. ప్రజాస్వామ్య సమాజంలో చీటబద్ధమైన పాలనను కొనసాగించిడంలో న్యాయ సంస్థల పట్ల గౌరవం ఒక ముఖ్యమైన అంశం. చట్టబద్ధమైన ప్రక్రియలను దాటవేయడాన్ని ఇస్లాం తీవ్రంగా నిరుత్సాహపరుస్తుంది. భూమిని కొనుగోలు చేసి, మతపరమైన పదేశాలను అధికారిక రికార్డులలో నమోదు చేయడం ద్వారా వాటిని చట్టబద్ధంగా రిజిస్టర్ చేయించేందుకు, ముస్లిం నాయకత్వం దేశవ్యాప్తంగా అవగాహన్ కార్యక్రమాలను పరిరక్షిస్తుంది. ప్రారంభించాలి. ఈ విధానం వ్యక్తిగత హక్కులను మరియు సమాజ విస్తృత ప్రయోజనాలను రెండింటినీ

అంతిమంగా, జాతీయ భద్రత, ప్రభుత్వ భూములు, మరియు మతపరమైన కటడాలకు సంబంధించిన విషయాలు తరచుగా సున్నితమైనవి మరియు సంక్లిష్టమైనవి. వీటికి వాస్తవాలు, చట్టపరమైన ఆధారాలు, మరియు రాజ్యాంగ సూత్రాలను జాగ్రత్తగా పరిశీలించడం అవసరం. అందువల్ల ప్రజా చర్చ గౌరవప్రదంగా ఉండాలి మరియు వదంతులు లేదా ధృవీకరించని వాదనలను వ్యాప్తి చేయకుండా డా ఉండాలి. అసంపూర్ణమైన లేదా తప్పుదారి పట్టించే సమాచారం వేగంగా వ్యాప్తి చెందగల సోషల్ మీడియా యుగంలో ఈ సూత్రం ప్రత్యేకంగా వర్తిస్తుంది.

ముగింపుగా, ఇస్లాం న్యాయాన్ని, చట్టబద్ధమైన అధికారాన్ని, సాక్ష్యాధారిత నిర్ణయాలను, ఆస్తి హక్కుల పట్ల గౌరవాన్ని మరియు వివాదాల శాంతియుత పరిష్కారాన్ని సమర్థిస్తుంది. మతపరమైన భక్తి ఎల్లప్పుడూ నిజాయితీ మరియు నిష్పక్షపాతంతో కూడి ఉండాలని అది బోధిస్తుంది. ఏ చట్టపరమైన వివాదం యొక్క ఫలితం ఎలా ఉన్నప్పటికీ, ముస్లింలు చట్టబద్ధమైన ప్రక్రియలను గౌరవించాలని, అభిప్రాయాలను ఏర్పరచుకునే ముందు సమాచారాన్ని సరిచూసుకోవాలని, మరియు ఇస్లామిక్ నీతికి పునాది అయిన ఆరాధన యొక్క పవిత్రతను మరియు న్యాయ సూత్రాలను నిలబెట్టాలని ప్రోత్సహించబడతారు. భూమి, ప్రభుత్వ ఆస్తి లేదా నిర్మాణం యొక్క యాజమాన్యానికి సంబంధించిన ప్రశ్నలను న్యాయస్థానాలు చట్టపరమైన సాక్ష్యాలను ఉపయోగించి పరిశీలిస్తాయి. వివాదాలను పరిష్కరించడంలో ఇస్లామిక్ చట్టం కూడా సాక్ష్యానికి గొప్ప ప్రాముఖ్యతను ఇస్తుంది. ప్రవక్త ముహమ్మద్ ఇలా అన్నారు, "నిరూపణ భారం వాడిపై ఉంటుంది (హదీస్ 33, 40 హదీస్ అన్-నవావి)". ఈ సూత్రం శతాబ్దాలుగా ఇస్లామిక్ న్యాయ పద్ధతికి మార్గదర్శకంగా ఉంది. ఆస్తి లేదా యాజమాన్యానికి సంబంధించిన వాదనలు ఊహాగానాలు లేదా భావోద్వేగాల ఆధారంగా కాకుండా విశ్వసనీయమైన సాక్ష్యాల ద్వారా బలపరచబడాలి.

ఆరాధనా స్థలాలను చట్టబద్ధమైన మరియు నైతిక మార్గాల ద్వారా స్థాపించాలని ఇస్లాం బోధిస్తుంది. ఇతరుల ఆస్తిని అన్యాయంగా వినియోగించడం లేదా తీసుకోవడం పట్ల ఖురాన్ విశ్వాసులను హెచ్చరిస్తుంది: "ఒకరి సంపదను మరొకరు అన్యాయంగా వినియోగించుకోవద్దు (సూరా అల్-బఖరా 2:188)". ఈ కారణంగా, చట్టబద్ధంగా సంపాదించిన మరియు యాజమాన్య వివాదాలు లేని భూమిపై మసీదును నిర్మించాలని సాంప్రదాయ న్యాయశాస్త్రవేత్తలు సాధారణంగా అభిప్రాయపడ్డారు. అల్లాహ్ ఆరాధనకు అంకితమైన ప్రదేశం వివాదాస్పద వాదనలు లేదా చట్టవిరుద్ధమైన ఆక్రమణపై కాకుండా, న్యాయం మరియు స్పష్టమైన చట్టపరమైన హక్కులపై ఆధారపడి. ఉండాలి ఇస్లాం చరిత్ర అంతటా, ఒక మసీదు యొక్క పవిత్రత అది పాపించబడిన చట్టబద్ధమైన పద్ధతితో సన్నిహితంగా ముడిపడి ఉంటుందని పండితులు నొక్కి చెప్పారు. ఇతరులకు చెందిన భూమిపై వారి అనుమతి లేకుండా గానీ, లేదా వివాదాస్పద ఆస్తిపై గానీ మసీదును నిర్మించడం అనేది ఇస్లాం సమర్థించే న్యాయ సూత్రాలకు సాధారణంగా విరుద్ధంగా పరిగణించబడింది. పవక ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా ఇతరుల హక్కులను గౌరవించాలని బోధించారు. ఆయన ఇలా అన్నారు, "ఎవరైనా ఇతరుల భూమిలో కొంత కొంత భాగాన్ని అన్యాయంగా తీసుకుంటే అతను పునరుతాన దినాన ఏడు భూలోకాలలోకి కుంగిపోతాడు (సహీహ్ అల్-బుఖారీ 2454)". ఈ హదీస్, ఇస్లాం ఆస్తి హక్కులను ఎంత తీవ్రంగా పరిగణిస్తుందో తెలియ ంజేస్తుంది.భూ యాజమాన్యానికి సంబం ధించిన కేసులను న్యాయస్థానాలు విచారిం చేటప్పుడు. పత్రాలు, రికార్డులు, సాక్షుల వాంగ్మూలాలు మరియు వర్తించే చట్టాలను పరిశీలిస్తాయి. ప్రజాస్వామ్య సమాజంలో చీటబద్ధమైన పాలనను కొనసాగిం చిడంలో న్యాయ సంస్థల పట్ల గౌరవం ఒక ముఖ్యమైన అంశం. చట్టబద్ధమైన ప్రక్రియలను దాటవేయడాన్ని ఇస్లాం తీవ్రంగా నిరుత్సాహపరుస్తుంది. భూమిని కొనుగోలు చేసి, మతపరమైన పదేశాలను అధికారిక రికార్డులలో నమోదు చేయడం ద్వారా వాటిని చట్టబద్ధంగా రిజిస్టర్ చేయించేందుకు, ముస్లిం నాయకత్వం దేశవ్యాప్తంగా అవగాహన్ కార్యక్రమాలను పరిరక్షిస్తుంది. ప్రారంభించాలి. ఈ విధానం వ్యక్తిగత హక్కులను మరియు సమాజ విస్తృత ప్రయోజనాలను రెండింటినీఅంతిమంగా, జాతీయ భద్రత, ప్రభుత్వ భూములు, మరియు మతపరమైన కటడాలకు సంబంధించిన విషయాలు తరచుగా సున్నితమైనవి మరియు సంక్లిష్టమైనవి. వీటికి వాస్తవాలు, చట్టపరమైన ఆధారాలు, మరియు రాజ్యాంగ సూత్రాలను జాగ్రత్తగా పరిశీలించడం అవసరం. అందువల్ల ప్రజా చర్చ గౌరవప్రదంగా ఉండాలి మరియు వదంతులు లేదా ధృవీకరించని వాదనలను వ్యాప్తి చేయకుండా డా ఉండాలి. అసంపూర్ణమైన లేదా తప్పుదారి పట్టించే సమాచారం వేగంగా వ్యాప్తి చెందగల సోషల్ మీడియా యుగంలో ఈ సూత్రం ప్రత్యేకంగా వర్తిస్తుంది.ముగింపుగా, ఇస్లాం న్యాయాన్ని, చట్టబద్ధమైన అధికారాన్ని, సాక్ష్యాధారిత నిర్ణయాలను, ఆస్తి హక్కుల పట్ల గౌరవాన్ని మరియు వివాదాల శాంతియుత పరిష్కారాన్ని సమర్థిస్తుంది. మతపరమైన భక్తి ఎల్లప్పుడూ నిజాయితీ మరియు నిష్పక్షపాతం తో కూడి ఉండాలని అది బోధిస్తుంది. ఏ చట్టపరమైన వివాదం యొక్క ఫలితం ఎలా ఉన్నప్పటికీ, ముస్లింలు చట్టబద్ధమైన ప్రక్రియలను గౌరవించాలని, అభిప్రాయాలను ఏర్పరచుకునే ముందు సమాచారాన్ని సరిచూసుకోవాలని, మరియు ఇస్లామిక్ నీతికి పునాది అయిన ఆరాధన యొక్క పవిత్రతను మరియు న్యాయ సూత్రాలనునిలబెట్టాలని ప్రోత్సహించ్ బడతారు.

# లింగ నిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు

## పీసీ అండ్ పీఎన్డీటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి: డీఎంహెచ్ఓ డా. కె. ఆనంద్

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబరు 11:**జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణను అరికట్టేందుకు పీసీ అండ్ పీఎన్డీటీ చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ తెలిపారు. మహిళా శిశు సంరక్షణకు భరోసా కల్పించడంతో పాటు వైద్య రంగంలో చట్టబద్ధమైన, నైతిక ప్రమాణాలను కాపాడటం వైద్య, ఆరోగ్య శాఖ బాధ్యత అని పేర్కొన్నారు.

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆమోదంతో ఏర్పాటైన జిల్లా పీసీ అండ్ పీఎన్డీటీ సలహా కమిటీ సమావేశం డీఎంహెచ్ఓ డా. కె. ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం అంతాయిపల్లిలోని ఐడీఓసీ ప్రాంగణంలో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించారు.




జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణను నిరోధించడం, పీసీ అండ్ పీఎన్డీటీ చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయడం, వైద్య సంస్థల కార్యకలాపాలను చట్టబద్ధంగా పర్యవేక్షించడం వంటి అంశాలపై సమావేశంలో సమీక్షించారు.

ఈ సందర్భంగా అల్ట్రాసోనోగ్రఫీ కేంద్రాలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు, ఇమేజింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన 18 నూతన దరఖాస్తులను, ఇప్పటికే ఉన్న కేంద్రాల రెన్యువల్కు సంబంధించిన 12 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. ఆయా దరఖాస్తులను పీసీ అండ్ పీఎన్డీటీ చట్ట నిబంధనలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలించి, అర్హతలను బట్టి అనుమతులు, రెన్యువల్స్పై నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను చేపట్టారు.

ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని కమిటీ సభ్యులు సూచించారు. వైద్య సంస్థలు చట్టంలోని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. కె. ఆనంద్ మాట్లాడుతూ.. గర్భస్థ శిశు లింగ నిర్ధారణకు అడ్డుకట్ట వేయడంతో పాటు ఆడ శిశువుల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టడం అత్యంత ప్రాధాన్యమన్నారు. పీసీ అండ్ పీఎన్డీటీ చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వబోమని తెలిపారు. వైద్య సంస్థల అనుమతులు, రెన్యువల్స్ ప్రక్రియను చట్ట నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కట్టుబడి ఉందన్నారు.

సమావేశంలో జిల్లా స్థాయి పీసీ అండ్ పీఎన్డీటీ సలహా కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరసనలో ఇద్దరు ఆశా వర్కర్లకు అస్వస్థత

హైదరాబాద్ హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం దగ్గర ఆశా వర్కర్లు తమ డిమాండ్లను నెరవేర్చాలని నిరసనకు దిగారు. నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లను పోలీసులు అరెస్ట్ చేస్తున్న సమయంలో ఇద్దరు స్ట్రోక్కు గురై అస్వస్థత పాలయ్యారు. దీంతో పోలీసులు జులుం నశించాలని అంటూ ఆశా వర్కర్ల నినాదాలు మిన్నంటాయి. పోలీసులు ఇష్టానుసారంగా దాడి చేసి మా వేళ్లు విరుస్తున్నారని ఆశా వర్కర్ల ఆవేదన వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేసారు.

# రోస్టర్ విధానంపై అందోల్ మండల కేంద్రంలో మీడియా సమావేశం

## మాల విద్యార్థులు, నిరుద్యోగులకు, మరియు ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై ఎం సి ఎఫ్ మాల కోఆర్డినేషన్ పోరం మాల ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ మరియు రోస్టర్ విధానం, అమలులోకి వచ్చిన నాటి నుండి, మాల సామాజిక వర్గ విద్యార్థులు, నిరుద్యోగులు, మరియు ఉద్యోగులు, తమ హక్కులను ఉపాధి అవకాశాలను కోల్పోతూ, తీవ్రంగా నష్టపోతున్నారు, ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై గళం విప్పేందుకు (ఎం సి ఎఫ్ ) ఆధ్వర్యంలో13.09.2026, ఆదివారం నాడు శ్రీలక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ లో, భారీ సభను నిర్వహిస్తున్నాం, ప్రభుత్వ కక్షపూరిత విధానాలు, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని, కాంగ్రెస్ ప్రభుత్వం, మాల సామాజిక వర్గంపై తీవ్రమైన కక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని, గత రెండేళ్లుగా అమలు అవుతున్న, రోస్టర్ విధానం వల్ల, మాలవర్గాల అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారుతుంది, ఉద్యోగ అవకాశాలు అన్యాయం, ఇప్పటివరకు వెలువడిన 25, నోటిఫికేషన్లలో రోస్టర్ విధానం వల్ల మాల వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగింది, సుమారు 19, నోటిఫికేషన్లలో, కనీసం ఒక పోస్ట్ కూడా కేటాయించకుండా, జీరో పోస్టులు చూపడం దీనికి నిదర్శనం,



గతంలో ఉన్న రిజర్వేషన్ ఫలాలు కూడా సక్రమంగా అమలు కావడం లేదు, ఉధృతం అవుతున్న పోరాటం (ఎం సి ఎఫ్) వ్యవస్థాపకుడు, ఎం.ఎఫ్, గోపీనాథ్, నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 5, లక్షల మందికి పైగా విద్యార్థులు నిరుద్యోగుల, ఉద్యోగుల, మద్దతుతో ఉద్యమ రూపం దాల్చింది, జిల్లాల వారీగా సన్నాహాలు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల, మండల నియోజకవర్గ కేంద్రాలకు ఈ సమస్యను తీసుకువెళ్లేలా రౌండ్ టేబుల్ సమావేశాలు, సన్నాహక ప్రెస్ మీట్లు, ముమ్మరంగా నిర్వహిస్తున్నాము, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగ సలహాదారు అనంతయ్య, రిటైర్డ్ ప్రిన్సిపల్ దేవయ్య, మరియు జిల్లా మాలమహానాడు అధ్యక్షులు అందోల్ మల్లేశం, మాల స్టూడెంట్స్ జేఏసీ వైస్ చైర్మన్ పండుగ భాను తేజ, యాదయ్య, మొగులయ్య, దీన బాంధవ్, చెట్టయ్య, మల్లేశం, పాపయ్య, దిలీప్, మ్యాదరి జగదీష్, అనిల్ కుమార్, సంజీవ్ టీచర్,ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు..

# పార్థివ లింగాల తయారు

వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన లింగేశ్వర నిర్మాణోత్సవం కార్యక్రమంలో జ్యోతిర్ వాస్తు విద్యాపీఠ వ్యవస్థాపకులు డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా 10 కోట్ల పార్థివ లింగాలతో మహాలింగ నిర్మాణం చేపట్టే మహోన్నత కార్యక్రమంలో భాగంగా భక్తులు పార్థివ లింగాలను తయారు చేశారు.ఈ సందర్భంగా సుమారు 600 మంది భక్తులు, మహిళలు కలిసి 1,40,000 పార్థివ లింగాలను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి భక్తులకు ఆధ్యాత్మిక బోధ చేస్తూ భక్తి, ధర్మం, సత్ప్రవర్తన ప్రాధాన్యాన్ని వివరించారు.కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు విశ్వనాథం సత్యనారాయణ, చిగుళ్లపల్లి మంజుల రమేష్, ప్రముఖులు కే. ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ సబిత ఆనంద్, డాక్టర్ చంద్రప్రియ, డాక్టర్ ఉజ్వల్, కౌన్సిలర్లు మరియు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్ వైపు ఏఐ ప్రపంచం చూపు

## (హెచ్.ప్రతాప్)

తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో హైదరాబాద్ మరో కీలక మైలురాయిని చేరుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికత వేగంగా విస్తరిస్తున్న వేళ, రాష్ట్రంలో భారీ స్థాయిలో కృత్రిమ మేధ సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అనుబంధ సంస్థ, భాగస్వామ్య సంస్థలు కలిసి సుమారు రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టే ప్రణాళిక ప్రకటించడం దేశ సాంకేతిక రంగంలోనే గణనీయమైన పరిణామం. దాదాపు ఒక గిగావాట్ సామర్థ్యంతో ప్రతిపాదిత ఈ కేంద్రం హైదరాబాద్‌ను భవిష్యత్తు డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా మరింత బలోపేతం చేయగలదు.

ఇది కేవలం ఒక భారీ పెట్టుబడి కాదు. కృత్రిమ మేధ ఆధారిత సేవలకు అవసరమైన విపరీతమైన కంప్యూటింగ్ శక్తి, సమాచార నిల్వ, అధిక వేగవంతమైన నెట్‌వర్క్‌లు, విద్యుత్, శీతలీకరణ వ్యవస్థలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఇది దోహదపడుతుంది. ఫలితంగా హైదరాబాద్‌లో సాంకేతిక సంస్థలకు కొత్త అవకాశాలు ఏర్పడటమే కాకుండా, అనుబంధ రంగాల్లోనూ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది.

అత్యంత ముఖ్యమైన అంశం ఉద్యోగ అవకాశాలు. సమాచార కేంద్రాల నిర్మాణం, నిర్వహణ, విద్యుత్ వ్యవస్థలు, భద్రత, నెట్‌వర్క్ నిర్వహణ, కృత్రిమ మేధ, సమాచార విశ్లేషణ వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు డిమాండ్ పెరుగుతుంది. ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు పరోక్షంగా అనేక సేవారంగాలకు ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. అందువల్ల తెలంగాణ యువతకు ఇది ఒక పెద్ద అవకాశంగా మారవచ్చు.

అయితే ఇంతటి భారీ సమాచార కేంద్రానికి విద్యుత్, నీరు, భూమి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా అత్యంత కీలకం. భారీ విద్యుత్ వినియోగం ఉండే ఇటువంటి కేంద్రాలకు పునరుత్పాదక ఇంధనాన్ని విస్తృతంగా అనుసంధానించడం, నీటి వినియోగాన్ని తగ్గించే సాంకేతికతలను అమలు చేయడం అవసరం.

హైదరాబాద్‌కు ఇప్పటికే ఉన్న సాంకేతిక ప్రతిభ, పరిశోధనా సంస్థలు, పారిశ్రామిక వాతావరణానికి ఈ పెట్టుబడి మరింత బలం చేకూర్చవచ్చు. అయితే పెట్టుబడి ప్రకటనను కేవలం గర్వకారణంగా చూడకుండా, స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, ఉద్యోగాలు, చిన్న సంస్థలకు అవకాశాలు కల్పించే విధంగా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలి.

కృత్రిమ మేధ భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థను నిర్ణయించే శక్తిగా మారుతున్న సమయంలో, హైదరాబాద్ ఆ భవిష్యత్తును కేవలం వీక్షించే నగరంగా కాకుండా నిర్మించే నగరంగా ఎదగాలి.

## శ్రీకృష్ణ మందిరం నూతన భవన నమూనాను ఆవిష్కరించిన డా.కె.వి.రమణాచారి




హైద్రాబాద్ సెప్టెంబర్ 11: కృష్ణాష్టమి వేడుకలను ఇటీవల ఘనంగా నిర్వహించిన శ్రీకృష్ణ మందిరం ట్రస్ట్ నూతన భవన నమూనాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి రమణాచారి ఆవిష్కరించారు. అలాగే దేవాలయానికి సంబంధించిన చిత్రాల వివరాలను తెలియజేసే బ్రోచర్ ను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి ఆవిష్కరించారు ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాల ద్వారానే మనసుకు ప్రశాంతత సమాజానికి సమైక్యత చేకూర్తాయని అన్నారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు త్రిమూర్తుల గౌరీ శంకర్ దంపతులు నిర్వహించిన నిత్య పూజ కార్యక్రమాలతో అక్కడ ఆధ్యాత్మిక శోభను సంతరింపజేశాయి. అలాగే ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో ఇక్కడ శ్రీకృష్ణతత్వం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వి కృష్ణకుమారి, ఏ విద్యాలక్ష్మి, లక్ష్మణ రేఖ గోపాలకృష్ణ, కేఎస్ కిరణ్ కుమార్, రవి చారి, టీవీ స్వామి, రఘు శ్రీ ,సాధన నరసింహచార్య తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా జయ వెంకటేష్ బృందం, పీవీ సుందరవల్లి శ్రీదేవి బృందం, వేణుమాధవ్ రెడ్డి ప్రణీత రెడ్డి బృందం, సూర్యకుమార్ బృందం భక్తి సంగీత కార్యక్రమ ప్రసంగాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.




## పేద మహిళ గుండె చికిత్స కు వెస్సో సాయం



హైద్రాబాద్ సెప్టెంబర్ 11: పశ్చిమ గోదావరి జిల్లా తణుకు చెందిన వరదా భ్రమరాంబ(53) గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు.

ఆమెను కాకినాడలోని వైద్యులు పరీక్షించి, గుండెలో ఏర్పడిన బ్లాక్ ను తొలగించేందుకు బెలూన్ థెరపీ చేయాల్సి ఉంటుందని, ఇందుకు సుమారు లక్షన్నర ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు.

వైద్యుల ప్రకారం, ఈ చికిత్సకు ఆరోగ్యశ్రీ పథకం వర్తించదు.

ప్రస్తుతం ఆమె అద్దె ఇంటిలో నివసిస్తూ నెలకు రూ.3,000 అద్దె చెల్లిస్తున్నారు.

ప్రస్తుతం భ్రమరాంబ కుటుంబ పరంగా ఎటువంటి ఆర్థిక సహాయం అందే పరిస్థితి లేదు!

ఈ పరిస్థితుల్లో, తన సోదరి భ్రమరాంబ గుండె చికిత్సకు ఆర్థిక సహాయం అందించమని గాయత్రి విజ్ఞప్తి చేసారు. వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో గాయత్రి కి 66,000 రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షుడు బంగారు తాతారావు మాట్లాడుతూ మానవతా దృక్పథం తో స్పందించి భ్రమరాంబ వైద్యానికి సహాయం అందించిన గౌరవ దాతలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

## నిరసన స్థలాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడమా?

### ఇది నిరసనకారులను అవమానించడమే..

### కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు

కారేపల్లి, సెప్టెంబర్ 11 ): ఎర్రవల్లిలో ప్రజాస్వామ్యబద్ధంగా డప్పులు కొట్టి నిరసన తెలిపిన ప్రదేశంలో అనంతరం పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడాన్ని కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు తీవ్రంగా ఖండించారు. నిరసన తెలిపిన ప్రదేశాన్ని అపవిత్రమైనదిగా భావించేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే హక్కు ఉందని పేర్కొన్నారు. తమకు నచ్చని అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన వారిని కించపరిచేలా లేదా అవమానించేలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. నిరసన స్థలంలో పసుపు నీళ్లు చల్లడం ద్వారా నిరసనకారుల పట్ల తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.రాజకీయాల్లో విమర్శలు, నిరసనలు సహజమేనని, వాటికి రాజకీయంగానే సమాధానం ఇవ్వాలని గుడిపూడి తిరుమల రావు అన్నారు. ఇలాంటి చర్యలతో ప్రజల మధ్య విభేదాలు పెరిగే అవకాశం ఉందని, ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే విధానాలకు దూరంగా ఉండాలని సూచించారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శిగా అల్లం యాదయ్య



హైద్రాబాద్ సెప్టెంబర్ 11:జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శిగా అల్లం యాదయ్య నియమితులయ్యారు ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య బీసీ భవన్ లో నియామక పత్రాన్ని అందజేశారు అల్లం యాదయ్య ప్రస్తుతం ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ బ్యాక్వర్డ్ క్లాస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శిగా,ఓబీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కొనసాగుతు ఉద్యోగుల సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. అల్లం యాదయ్య చేస్తున్న పోరాటాలను గుర్తించిన ఆర్ కృష్ణయ్య అతన్ని బీసీ సంక్షేమ సంఘం ఎంప్లాయిస్ అసోసియేషన్ రెండు తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా అల్లం యాదయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో బీసీ ఉద్యోగుల సమస్యలపై వాటి పరిష్కారానికి పోరాటం చేస్తా నన్నారు. తనపై గల నమ్మకంతో తనకు ఈ పదవినిచ్చిన ఆర్ కృష్ణయ్యకు అల్లం యాదయ్య కృతజ్ఞతలు తెలిపారు

## మర్పల్లి ఏ పీ ఓ విధి నిర్వహణలో కంచు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి ఏపీవో గా విధులు నిర్వహిస్తున్న అంజిరెడ్డి విధినిర్వహణలో వారి కృషి సేవ మంచితనం ఆప్యాయతలు కంచు అని చెప్పుకోవచ్చు అని గ్రామాల్లో వెళ్ళినప్పుడు గ్రామ ప్రజలు అంటూ ఉంటారు గ్రామాల్లో ఫీల్డ్ విజి ట్లో వెళ్ళినప్పుడు ఉపాధి హామీలో పని చేస్తున్నటువంటి పని వారితో వారు ఎంతో ఆప్యాయంగా పలకరింపు అందరి క్షేమం కోరే విధంగా తగు జాగ్రత్తలు సూచనలు ఇస్తూ ఉంటారు పని ప్రదేశంలో ప్రశాంతంగా తమకున్న పనులు పూర్తి స్థాయిలో ముగించుకొని గృహాలకు క్షేమకరంగా వెళ్లాలని ప్రభుత్వం నుండి వచ్చే నిధుల గురించి సమావేశాల్లో ప్రజలకు అర్థమయ్యే విధంగా విశ్లేషిస్తూ తగు సూచనలు సలహాలు చెబుతూ ఉంటారు వారు మాట్లాడుతున్నప్పుడు ముఖంలో చక్కటి చిరునవ్వు కురిపిస్తూ ఏ ఒక్కరిని ఇబ్బంది పరచకుండా చీదరించుకోకుండా అందర్నీ పలకరిస్తూ సమావేశాల్లో పాల్గొంటారని గ్రామ ప్రజలు సీనియర్ మేటిలు తెలిపారు

## మహాసభను జయప్రదం చేయండి : అఖిల భారత రైతు కూలి సంఘం




**పెద్దపల్లి, సెప్టెంబర్-11, ప్రజాబలం ప్రతినిధి:** పెద్దపెల్లి జిల్లా వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ పెద్దపెల్లి జిల్లా ప్రెస్ క్లబ్బులో ఈ నెల 25 న జరుగు ప్రధమ మహాసభకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి కె.విశ్వనాథ్ అఖిల భారత రైతు కూలి సంఘం(ఏఐకేయంఎస్ )రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్ భీమన్న, నాయకులు దాముక లచ్చన్న, భూష్పాక దేవన్న సమ్మక్క, రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రైతాంగంపై ప్రభుత్వం అనేక రకాల ఆంక్షలు విధిస్తుందన్నారు ముఖ్యంగా పెద్దపల్లి జిల్లా పరిషత్ ప్రాంతాల్లో వేలాది ఎకరాల మిగులు భూములు ఉన్నా నేటికీ అర్హులైన వేలాదిమంది భూమిలేని కౌలు రైతులు గానే జీవిస్తున్నారని కౌలు రైతు చట్టం ప్రకారం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రకటించాలి కానీ సంక్షేమ పథకాలన్నీ కాగితాలకే పరిమితం అవుతున్నాయి కౌలు రైతులు ఎలాంటి సంక్షేమ పథకాలు నోచుకోకుండా కౌలు చెల్లిస్తూ కూలి రైతులు గానే జీవిస్తున్నారన్నారు. వీరికి పంట నష్టం గాని ప్రభుత్వ సబ్సిడీలు గాని అందలేని స్థితిలో ఉన్న కౌలు రైతులకు ప్రభుత్వం తక్షణమే గుర్తింపు కార్డులు ఇస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతాంగ సమస్యలపై అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐఎంకేఎస్) మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందించుకుంటుందని, ఈ మహాసభను రైతు కూలీలు జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్ భీమన్న కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### జూనియర్ కళాశాల అదనపు తరగతి గదులు, పునరుద్ధరణ పనులను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలి..

**పెద్దపల్లి, సెప్టెంబర్ 11, ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న





ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఒప్పందంలో నిర్దేశించిన గడువు మేరకు మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ, పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, విద్యాబోధనకు సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో టీజీఎంఐడీసీ విశ్వప్రసాద్, సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు ,పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సత్వర పరిష్కారం చూపాలి

**అక్రమ ఇసుక, పశు రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**పెట్రోలింగ్, బ్లూ కోట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలి**

**అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్**




**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 11:**వార్షిక తనిఖీలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను



ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వివిధ వర్టికల్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రేవ్, ప్రాపర్టీ, దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిందితులను త్వరగా గుర్తించి అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన ఆస్తిని రికవరీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా అక్రమ పశు రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.

కేసుల దర్యాప్తులో భాగంగా గత నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

పెట్రోలింగ్ వాహనాలు, బ్లూ కోట్స్ వాహనాల్లో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే స్పందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లోనిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించిన అనంతరం పోలీసింగ్ వెబ్ అప్లికేషన్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు సీఐఆర్ పోర్టల్, ఈ సాక్ష, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా నేరాల దర్యాప్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీఐ శ్రీలక్ష్మి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ విజయసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సహకారించాలి

**శాంతి కమిటీల సమన్వయ సమావేశంలో పోలీస్ కమిషనర్**





**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 11:**వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని శాంతి సామరస్యాన్ని కాపాడుకుంటూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రుల ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పీస్ కమిటీలతో వినాయక నవరాత్రి విగ్రహాల ఏర్పాట్లు, బందోబస్తుపై పోలీసు కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... కమిషనరేట్ పరిధిలో జరుపుకొనే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలన్నారు.

అదేవిదంగా సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలకు అవగాహన కల్పించడం. అనుమానాస్పద సమాచారం లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

గణేష్ నవరాత్రుల ఉత్సవాలు శాంతియుతంగా, సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా భద్రతకు సంబంధించి, పోలీసు, నగరపాలక సంస్థ , అగ్ని మాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తూ, శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుకునేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాంతి కమిటీ సభ్యులు పోలీసులు సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.

వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మతపరమైన సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు.

# పౌష్టికాహారంలో నిర్లక్ష్యం సహించం

**గర్భిణులు, చిన్నారులు, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి**

**తెలంగాణ ఆహార కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్**



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబరు 11:** గర్భిణులు, చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ స్పష్టం చేశారు. అర్హులైన వారికి పౌష్టికాహారం అందించడం చట్టబద్ధమైన హక్కు అని, ఆ హక్కు అమలులో లోపాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, సభ్యులు ఆనంద్, జ్యోతి శుక్రవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో పర్యటించారు. మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో కీసర ఆర్డీవో వెంకట్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు. అనంతరం మేడ్చల్‌లోని చౌకధరల దుకాణాలను కమిషన్ బృందం తనిఖీ చేసింది. డీలర్ వద్ద స్టాక్, రిజిస్టర్లను పరిశీలించింది. దుకాణాల వద్ద ఫిర్యాదుల పెట్టెలను అందుబాటులో ఉంచాలని, జిల్లా పౌరసరఫరాల అధికారి, తహసీల్దార్ల ఫోన్ నంబర్లను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని ఛైర్మన్ సూచించారు. సన్నబియ్యం సరఫరా, పంపిణీపై స్థానిక ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

కిష్టాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను కమిషన్ బృందం సందర్శించింది. డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్‌లను పరిశీలించి సరుకుల గడువు తేదీలను తనిఖీ చేసింది. నాణ్యమైన సన్నబియ్యాన్నే వంటకు వినియోగించాలని, బియ్యం నాణ్యతలో లోపాలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి మార్చుకోవాలని సూచించారు.

పాఠశాలలో విద్యార్థులకు అందించిన ఉడికించిన గుడ్లను పరిశీలించగా వాటి రంగులో మార్పు కనిపించింది. దీనిపై కారణాలను తెలుసుకోవాలని, గుడ్ల నమూనాలను సేకరించి ఆహార భద్రతాధికారి ద్వారా పరీక్షలు నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

విద్యార్థుల ఆరోగ్య పరీక్షల రిజిస్టర్లను పరిశీలించిన కమిషన్ సభ్యులు రక్తహీనత ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారికి అవసరమైన పౌష్టికాహారం అందించాలని పాఠశాల ప్రిన్సిపల్‌కు సూచించారు. పేరెంట్స్ కమిటీ సమావేశాల నిర్వహణపై ఆరా తీసి సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు.

పదో తరగతి విద్యార్థులతో కమిషన్ సభ్యులు మాట్లాడి పాఠశాలలోని సమస్యలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందుతున్నాయా? మంచినీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. నిజాన్ని ధైర్యంగా చెప్పే అలవాటు పెంచుకోవాలని, సమస్యలను ఎదుర్కొనే ధైర్యంతోనే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగగలరని వారికి సూచించారు.

దమ్మాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కమిషన్ సభ్యులు.. విద్యార్థులు అధిక సంఖ్యలో ఇంటి నుంచి లంచ్ బాక్సులు తెచ్చుకోవడాన్ని గమనించారు. దీనిపై ఆరా తీయగా పాఠశాలలో అందించే భోజనం సరిగా ఉండకపోవడంతో ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు.

ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కమిషన్.. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించింది. ఇలాంటి లోపాలను ఉపేక్షించబోమని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. పాఠశాలలో భోజన ఏర్పాట్లను మళ్లీ పరిశీలిస్తామని హెచ్చరించింది.

**అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంపై తనిఖీ**

అనంతరం దమ్మాయిగూడ అంబేద్కర్‌నగర్, జవహర్‌నగర్, మల్కాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలను కమిషన్ బృందం సందర్శించింది. కేంద్రాల్లో ఉన్న చిన్నారుల సంఖ్య, గర్భిణుల వివరాలు, వారికి అందుతున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు తదితరాలపై ఆరా తీసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజువారీ భోజన మెనూను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించింది.

గర్భిణులు, 14 ఏళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం పొందడం చట్టబద్ధమైన హక్కు అని ఛైర్మన్ పేర్కొన్నారు. ఈ హక్కు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ఆహార కమిషన్‌పై ఉందన్నారు. హక్కుదారులకు ఎలాంటి నష్టం జరగకుండా, వారి హక్కులకు భంగం కలగకుండా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు. సమస్యలు ఎదురైతే కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ సభ్యులు తమ ఫోన్ నంబర్లను గర్భిణులకు అందజేశారు.

ఈ పర్యటనలో నోడల్ అధికారి సాంబశివరావు, జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ అధికారులు ఝాన్సీరాణి, వినోద్‌కుమార్, పద్మజ, కాంతమ్మ, డీఎంహెచ్ఓ డా. ఆనంద్, పౌరసరఫరాల అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.:ూ

# కొత్త క్రిమినల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**




**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 11:**ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది కొత్త క్రిమినల్ చట్టాపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు.

కొత్త క్రిమినల్ చట్టాలు--2023 అమలులోకి వచ్చిన నేపథ్యంలో 500 మంది సిటీ అర్మడ్ రిజర్వ్ పోలీస్ అధికారులు, సిబ్బందికి చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు గత వారం రోజులుగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని (సిటీసి) సిటీ ట్రైనింగ్ సెంటర్ నిర్వహించారు. ఈ శిక్షణలో భారతీయ న్యాయ సంహిత--2023 భారతీయ నాగరిక్ సురక్షా సంహిత--2023, భారతీయ సాక్ష్య అధినియమం--2023 లోని ముఖ్యమైన నిబంధనలు, కొత్త చట్టాల ప్రకారం కేసుల నమోదు, దర్యాప్తు విధానం, సాక్ష్యాల సేకరణ, డిజిటల్ మరియు ఎలక్ట్రానిక్ సాక్ష్యాల ప్రాధాన్యత, బాధితుల హక్కులు, అరెస్టు--రిమాండ్ ప్రక్రియ, కోర్టు విచారణ తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. కొత్త చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తును మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై అధికారులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వండం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా కొత్త చట్టాల అమలులో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సిటీసి ఏసీపీ హరినాద్ బాబు, ఆర్ ఐ నాగుల్ మీరా పాల్గొన్నారు.

# ఆర్హులకే రేషన్ కార్డులు ఇవ్వాలి

హైదరాబాద్ తెలంగాణలో 1.15 కోట్ల కుటుంబాలు ఉంటే 1.06 కోట్ల కుటుంబాలకి మనం రేషన్ కార్డులు ఇస్తున్నామం. అంటే బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్, కోకాపేట గేటెడ్ కమ్యూనిటీలో ఉండేవాళ్ళకి, ప్రభుత్వ ఉద్యోగులకి, సాఫ్ట్వేర్ ఉద్యోగులకి కూడా ఇస్తున్నట్లేనని కాంగ్రెస్ ఎమ్మెల్సీ భాను ప్రసాద్ అన్నారు. శుక్రవారం నాడు అయన మండలిలో మాట్లాడారు. 1.15 కోట్ల కుటుంబాలు ఉంటే 1.06 కోట్ల కుటుంబాలకి మనం రేషన్ బియ్యం ఇవ్వడం అంటే ప్రభుత్వ ధనాన్ని, టాక్స్ పేయర్స్ ధనాన్ని దుర్వినియోగం చేయడమే. ఐడెంటిఫై చేసి అర్హులకు మాత్రమే ఇవ్వండనిఅ అయన అన్నారు.

# మర్పల్లి మండలానికి భారీ మార్పు!

**పంచాయతీరాజ్ సబ్ డివిజన్ వికారాబాద్‌కు బదలాయింపు**
**తాండూర్ వెళ్లే కాంట్రాక్టర్లకు తప్పిన ఇబ్బందులు.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక చొరవ**

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధిమర్పల్లి, సెప్టెంబర్ 11(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలానికి ప్రభుత్వం కీలక మార్పు చేసింది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖపరిధులపునర్వ్యవస్థీకరణలో భాగంగా మర్పల్లి పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌ను తాండూర్ పరిధి నుంచి వికారాబాద్ పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలోకి మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ జీవో ఎంఎస్ నెంబర్ 32, తేదీ 10-09-2026ను విడుదల చేసింది.ఇప్పటివరకు మర్పల్లి, బంట్వారం, మోమిన్‌పేట్ ప్రాంతాలకు చెందిన పంచాయతీరాజ్ పనులు చేపట్టే కాంట్రాక్టర్లు పనుల బిల్లులు, ఎన్ఆర్ఈజీఎస్ తదితర పనులకు సంబంధించిన వ్యవహారాల కోసం తాండూర్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. దూరభారం, సమయాభావంతో పాటు ఒకే పనికి పలుమార్లు తాండూర్ వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇకపై వికారాబాద్ పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలోనే పనులు పూర్తి చేసుకునే అవకాశం కలగనుంది.






GOVERNMENT OF TELANGANA
ABSTRACT
PANCHAYAT RAJ & RURAL DEVELOPMENT (ENGG.ESTT) DEPARTMENT
G.O.Ms.No.32
ORDER
AMENDMENT

కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గూడెం రాములు యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఈ సమస్యను వికారాబాద్ ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన స్పీకర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పరిధి మార్పునకు మార్గం సుగమమైందని కాంగ్రెస్ నాయకులు మర్పల్లి సబ్ డివిజన్ వికారాబాద్ పరిధిలోకి రావడంతో కాంట్రాక్టర్లు, సంబంధిత పనులు చేపట్టే వారికి దూరభారం తగ్గి, బిల్లులు మరియు ఇతర అధికారిక పనుల కోసం వికారాబాద్‌లోనే వ్యవహారాలు పూర్తి చేసుకునే అవకాశం ఏర్పడింది. ఇంత మంచి కార్యక్రమాన్ని స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లి ఇది కావాలి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి అని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూ ఘనవిజయానికి కారణమైన మర్పల్లి వాస్తవ్యులు తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకులు గూడెం రాములు యాదవ్ చేసిన కృషిని ప్రశంసనీయమనితెలిపారు

# సెప్టెంబర్ 17తెలంగాణ విమోచన దినోత్సవంను అధికారికంగా నిర్వహించాలి

**విమోచన దినోత్సవం నిర్వహణపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేదు.**
**కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవం పేరిట రాజకీయాలు చేస్తుంది**
**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి**




. తెలంగాణ ప్రజలకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్పించేందుకు సాగిన చారిత్రక పోరాటం, తెలంగాణకు అసలైన స్వాతంత్రం లభించిన సెప్టెంబర్ 17 ను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించే పరిస్థితుల్లో లేదని, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాల్సిన కాంగ్రెస్ సర్కార్ , ప్రజా పాలన దినోత్సవం పేరిట రాజకీయాలు చేయడం మానుకొని, అధికారికంగా విమోచన దినోత్సవం నిర్వహించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మాన కొండూరు మండల కేంద్రంలో జరిగిన నియోజకవర్గస్థాయి మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి పై వ్యాఖ్యలు చేశారు. భారతదేశ సమైక్యత కోసం ఉక్కు సంకల్పంతో కృషి చేసిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో చేపట్టిన చర్యల ఫలితంగా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని గుర్తు చేశారు. తెలంగాణ విముక్తి కోసం రజాకార్ల దౌర్జన్యాలకు ఎదురొడ్డి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వేలాది మంది వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావు తదితరుల నాయకత్వంలో పోరాడిన కార్యకర్తలు, గ్రామీణ ప్రాంతాల్లో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సామాన్య ప్రజలు తెలంగాణ విమోచన చరిత్రలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

మహనీయుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, సెప్టెంబర్ 17ను 'ప్రజా పాలన దినోత్సవం' కాకుండా అధికారికంగా 'తెలంగాణ విమోచన దినోత్సవం'గా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన చరిత్రను మరుగునపరిచే ప్రయత్నాలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి, మానకొండూరు మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి, సెన్సార్ ఫిలిం బోర్డ్ మెంబర్ రాపాక ప్రవీణ్, జిల్లా నాయకులు అప్పని తిరుపతి, బొగ్గుల రమేష్, బూట్ల శ్రీనివాస్, దూలం కిరణ్ గౌడ్, మియాపురం లక్ష్మణచారి, కత్తి ప్రభాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి భాషబోయిన ప్రదీప్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు మీసా రమణయ్య, తిమ్మాపూర్ బీజేవైఎం మండల అధ్యక్షులు అరుణ్, బీజేవైఎం నాయకులు మగ్రి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్లలబ్ధి. స్థానికుల ఆరోపణ.





**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 2026**మనికొండ జాగీర్ శ్రీ లక్ష్మీ నగర్ ప్రాంతంలో టీమ్ 4 సంస్థ బహుళ అంతస్తుల భవన నిర్మాణాల దరిమిలా తమ ఇష్టానుసారంగా త్రవ్వకాలు చేపట్టి డ్రైనేజ్ వేయడం ద్వారా రహదారి మొత్తం గుంతల మయం అయిన విషయం జగమెరిగిన సత్యంకాగా మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రజా ధనం వెచ్చించి అట్టి సిమెంట్ రహదారిని కాస్తా ఇప్పటికే 4 గు 5 మార్లు వేయడం మళ్లీ గుంతలమయం కావటం పరిపాటిగా సాగుతోందని, ఈ దాగుడు మూతల సిమెంట్ రహదారి పలు మార్లు వేయడం ఖచ్చితంగా కాంట్రాక్టర్ల లబ్ధికొరకే నన్ని స్థానికులు సుమనళిని, సురేష్, హరీష్, శివకృష్ణ తదితరులు తెలయపరుస్తు ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినను దున్నపోతుపై వర్షం పడినట్లు గమ్మున ఉండడం, పరిణామ స్వరూపంగా వాహన దారులతో పాటు, గతవారం క్రితం నిండు గర్భిణి సైతం తీవ్ర ఇబ్బందులకు గురైందని స్థానికులు మండి పడుతున్నారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం - కాంట్రాక్టర్ల లబ్ధికొరకే అన్నచందాన బి.ఆర్.సి వద్ద పైప్ లైన్ రహదారి విస్తరణ పనులను మొదలు పెట్టగా భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, సుమనళిని తదితరులు పరిశీలించడం జరిగింది, నాసిరకం పనులు చేయడంలో ఘనత వహించిన కాంట్రాక్టర్ల పని తీరులో భాగంగా రహదారి పక్కన జరుగుతున్న విస్తరణకు గాను కేవలం నాలుగైదు ఇంచుల త్రవ్వకాలు చేసి సరైన కంకర, ఇసుక సిమెంట్ లేకుండా కేవలం మట్టి పై అర్ధరాత్రి సిమెంట్ కాంక్రీట్ వేసి మంమహా అనిపించు కొవడానికి, బిల్లులు వసూలు చేసుకోవడం కాంట్రాక్టర్ల పని కాగా సరైన పద్ధతిలో పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టకుండా బిల్లులను ఆమోదం తెలుపడం అధికారుల వంతుగా సాగుతోందనడంలో సందేహం లేదని ఖరా ఖండిగా ప్రస్తావించారు.

# ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సత్తా చాటిన ఆశ్రమ విద్యార్థులు

**జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు**
**అభినందించిన ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బి. రవి,డిప్యూటీ వార్డెన్ డిఎస్.నాగేశ్వరరావు**



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 11:**మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఏన్కూరు మండల కేంద్రంలో నిర్వహించిన క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన 13 మంది విద్యార్థులను పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బి.రవి మరియు డిప్యూటీ వార్డెన్ డిఎస్.నాగేశ్వరరావు అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ 14 వాలీబాల్ విభాగంలో విన్నర్స్ గా,అండర్ 17 వాలీబాల్ విభాగంలో రన్నర్స్ గా నిలిచారని తెలియజేశారు. అలాగే క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ,పట్టుదల, సమయపాలన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు.చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని,జిల్లా స్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులలో ఫిజికల్ డైరెక్టర్ బి.సక్రామ్ కృషి ఎంతైనా ఉందని వారిని అభినందించారు. "క్రీడల్లో విజయం ఒక్కరోజులో రాదు.. నిరంతర సాధన, క్రమశిక్షణ,పట్టుదలతోనే విజయ శిఖరాలను అధిరోహించవచ్చు"అని విద్యార్థులకు సూచించారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,తోటి విద్యార్థులు అభినందిస్తూ ,తదుపరి పోటీలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బి. సక్రామ్,ఉపాధ్యాయులు బి.శోభన్ నాయక్, బి.రవి,బి.సింగ్య ఎం.చందర్రావు ,పాయం శ్రీనివాస్,జే. నాగేశ్వరరావు, బి.శారదభాయి, డి.ఉషశ్రీ, హర్యానాయక్ మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ సంగం అధ్యక్షులుగా నర్సిములు ఏకగ్రీవ ఎన్నిక



**జహీరాబాద్, సెప్టెంబర్ 11 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణ ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా గద్దె నర్సిములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించింది. గత 12 ఏళ్లుగా సంఘం కోశాధికారిగా సేవలందించిన నర్సిములును సభ్యులు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పదవిని అధికారంగా కాకుండా బాధ్యతగా భావిస్తూ సంఘంలోని సభ్యుల ఐక్యత, గౌరవం, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. సభ్యుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వృత్తిపరమైన అభివృద్ధికి కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో సహకరించిన జిల్లా నాయకత్వానికి, సంఘ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

# కేంద్రం నుంచి రావాల్సిన 720 కోట్ల రూపాయలు బకాయిలు

హైదరాబాద్ దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లు గొప్ప కార్యక్రమం. రాష్ట్రంలో దాదాపు 2 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించడం శుభపరిణామమని టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన శాసనమండలిలో మాట్లాడుతూ దేశంలో పేదోడి సొంతింటి కలను సాకారం చేసింది కాంగ్రెస్ పార్టీ. గత పదేళ్ల బిఆర్ఎస్ హయంలో అల్లుడు వస్తే ఎక్కడ పడుకుంటాడు ఎగతాళి చేసి ఇళ్లు నిర్మించలేని దుస్థితి . నిజామాబాద్ లో పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం జరిగింది. కేంద్రం నుంచి రావాల్సిన 720 కోట్ల రూపాయలు బకాయిలు తక్షణం విడుదల చేయాల్సిన అవసరం ఉందీ. పేదవాడి కలను సాకారం చేయాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి. ఇళ్ల పేరిట బిఆర్ఎస్ ఓట్లు దండుకుంది. పాపం పండి కేసిఆర్ ఫామ్ హౌస్ కి పరిమితమయ్యారని అయన అన్నారు.

# ఏఐ యుగంలో రిపోర్టింగ్ పై అతిథి ఉపన్యాసం : నిజం, సమాచార ధృవీకరణ, నైతిక జర్నలిజం ప్రాధాన్యతపై అవగాహన



**హైదరాబాద్, సెప్టెంబర్ 11, 2026 (ప్రజాబలం ప్రతినిధి) :** "ఏఐ యుగంలో రిపోర్టింగ్: డీప్‌ఫేక్స్, తప్పుడు సమాచారం మరియు దుష్ప్రచారం మధ్య నిజాన్ని ఎలా ధృవీకరించాలి" అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం సెప్టెంబర్ 11, 2026న హైదరాబాద్‌లోని ICFAI Law School, IFHEలో విజయవంతంగా నిర్వహించారు. జర్నలిజంలో కృత్రిమ మేధస్సు (AI) కారణంగా ఏర్పడుతున్న సవాళ్లు, ముఖ్యంగా డీప్‌ఫేక్స్, మిస్‌ఇన్ఫర్మేషన్, డిస్‌ఇన్ఫర్మేషన్ మరియు ఏఐ ద్వారా రూపొందుతున్న కంటెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యక్రమంలో IFHE రిజిస్ట్రార్ మరియు Centre for Women Development కన్వీనర్ ప్రొఫెసర్ డా. ఎస్. విజయలక్ష్మి ప్రారంభ వ్యాఖ్యలు చేస్తూ, అతిథులను మరియు విద్యార్థులను స్వాగతించారు. అనంతరం కార్యక్రమ ఉద్దేశ్యం, ప్రస్తుత మీడియా పరిస్థితుల్లో ఏఐ ప్రభావం గురించి నేపథ్యాన్ని వివరించారు.

ICFAI Law Schools డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ డా. విజేందర్ కుమార్ మాట్లాడుతూ, వేగంగా మారుతున్న డిజిటల్ వాతావరణంలో ఖచ్చితమైన మరియు బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ ప్రాధాన్యతను వివరించారు. కొత్త సాంకేతికతలను ఉపయోగించే సమయంలో జర్నలిస్టులు విశ్వసనీయత, వృత్తిపరమైన సమగ్రత మరియు నైతిక ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

ICFAI Law School డీన్ డా. ప్రొఫెసర్ వై. ప్రతాప్ రెడ్డి కూడా కార్యక్రమానికి హాజరై, వేగంగా మారుతున్న డిజిటల్ మరియు మీడియా వాతావరణాన్ని ఎదుర్కొనేందుకు విద్యార్థులకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఆయన పాల్గొనడం ఈ విద్యా కార్యక్రమానికి మరింత ప్రాధాన్యతను చేకూర్చింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథి వక్తగా గౌరా నైతాని, మాజీ ప్రాజెక్ట్ మేనేజర్, European Journalism Center, Netherlands మరియు Erasmus Mundus Scholar, పాల్గొన్నారు. ఏఐ ద్వారా రూపొందుతున్న కంటెంట్, డీప్‌ఫేక్స్, మిస్‌ఇన్ఫర్మేషన్ మరియు డిస్‌ఇన్ఫర్మేషన్‌పై ఆమె తన అనుభవాలను, నిపుణుల అభిప్రాయాలను విద్యార్థులతో పంచుకున్నారు. కృత్రిమంగా రూపొందించిన లేదా మార్పులు చేసిన కంటెంట్ ప్రజాభిప్రాయాన్ని ఎలా ప్రభావితం చేయగలదో, తద్వారా జర్నలిజం విశ్వసనీయతకు ఎలాంటి సవాళ్లు ఎదురవుతున్నాయో ఆమె వివరించారు.

జర్నలిజంలో సమాచార ధృవీకరణకు అత్యంత ప్రాధాన్యత ఉండాలని గౌరా నైతాని స్పష్టం చేశారు. డిజిటల్ కంటెంట్ నిజమైనదేనా కాదా అనే విషయాన్ని పరిశీలించడం, విశ్వసనీయ వనరులతో సమాచారాన్ని క్రాస్‌చెక్ చేయడం, మార్పులు చేసిన లేదా తప్పుదారి పట్టించే కంటెంట్‌ను గుర్తించడం, ధృవీకరించని సమాచారాన్ని ప్రచురించకుండా లేదా పంచుకోకుండా ఉండటం వంటి అంశాలపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిజం, ఖచ్చితత్వం, విశ్వసనీయత మరియు ప్రజల నమ్మకాన్ని కాపాడటం జర్నలిస్టుల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా కృత్రిమ మేధస్సు మీడియా రంగాన్ని ఎలా మారుస్తోందో, అదే సమయంలో జర్నలిస్టులకు ఎలాంటి కొత్త సవాళ్లను సృష్టిస్తోందో విద్యార్థులకు విలువైన అవగాహన లభించింది. ప్రతి సమాచారాన్ని ప్రశ్నించే దృక్పథాన్ని పెంపొందించుకోవడం, సమర్థవంతమైన వెరిఫికేషన్ పద్ధతులను అనుసరించడం, ఆధునిక జర్నలిజంలో నైతిక బాధ్యతలను అర్థం చేసుకోవడం వంటి అంశాలపై విద్యార్థులకు మార్గదర్శకత్వం లభించింది.

కార్యక్రమంలో నిర్వహించిన ఇంటరాక్టివ్ ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ఏఐ ద్వారా రూపొందుతున్న వార్తలు, డీప్‌ఫేక్స్, మిస్‌ఇన్ఫర్మేషన్, సమాచార ధృవీకరణ పద్ధతులు మరియు జర్నలిజం భవిష్యత్తు వంటి అంశాలపై వారు ప్రశ్నలు అడిగారు. ఈ ప్రశ్నోత్తర కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, ఆధునిక న్యూస్‌రూమ్‌లలో ఎదురవుతున్న ప్రాయోగిక సవాళ్లపై వక్తతో నేరుగా చర్చించే అవకాశం పొందారు.

కార్యక్రమం సమాచారపూర్వకంగా, ఆలోచింపజేసే విధంగా ముగిసింది. కృత్రిమ మేధస్సు యుగంలో బాధ్యతాయుతమైన జర్నలిజం, ఫ్యాక్ట్‌చెకింగ్ మరియు నిజాన్ని కాపాడాల్సిన అవసరంపై విద్యార్థులకు ఈ కార్యక్రమం విలువైన అవగాహనను అందించింది.

ఈ కార్యక్రమాన్ని Centre for Women Development (CWD), IFHE ఆధ్వర్యంలో Aparajitha, AAINAA మరియు Genesis Journalism Club సహకారంతో నిర్వహించారు. డా. పావని కనపర్తి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్, Genesis Journalism Club, కార్యక్రమ సమన్వయ బాధ్యతలను నిర్వహించారు. ప్రొఫెసర్ డా. కళా చెంజి, Centre for Women Development సభ్యురాలు, మరియు ప్రొఫెసర్ దేబజనీ కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

# సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలి

**- ప్రతి జిల్లా కేంద్రంలో విమోచన స్ఫూర్తి కేంద్రం ఏర్పాటు చేయాలి**

**- అమరవీరుల త్యాగాలను గౌరవించాలి**

**- జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందించిన బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



**చంద్రుగొండ /కొత్తగూడెం ప్రజాబలం ప్రతినిధి :-** సెప్టెంబర్ 17వ తేదీన అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరపాలని, సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టాచ్యూ ఆఫ్ లిబరేషన్ తెలంగాణాలో ఏర్పాటు చేయాలని భారతీయ

జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బిజెపి ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో మరువలేని మహోన్నతమైన రోజని,నిజాం నిరంకుశ పాలన రజాకార్ల దురగతాలు జమిందారి జాగిర్దారి దోపిడీ నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొంది భారతదేశంలో విలీనమైన చారిత్రాత్మక దినమన్నారు. అలాంటి సందర్భాన్ని మర్చిపోలేని విషయమన్నారు. అయితే ఈ ఒక్కరోజు ఈ యొక్క వియోచన కోసం అనేకమంది రైతులు మహిళలు యువకులు, సామాన్య ప్రజలు పోరాడి త్యాగాలు చేశారన్నారు. భారతదేశ ఐక్యత కోసం ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన రాజకీయ సంకల్పం భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ పోలో చారిత్రాత్మక పరిణామములు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.ఈ చరిత్రను భావితరాలకు అందించడం కేవలం రాజకీయ అంశం కాదని,తెలంగాణ చరిత్రను పరిరక్షించడం అమరవీరుల త్యాగాల్ని గౌరవించడం జాతీయ సమైక్యతను బలోపేతం చేయడం ముఖ్యమైన అంశమన్నారు.



ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తరఫున తెలంగాణ సప్త సంకల్పాలు రూపొందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అయితే సెప్టెంబర్ 17న అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలని, సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టాచ్యూ ఆఫ్ లిబరేషన్ తెలంగాణ లో ఏర్పాటు చేయాలని కోరారు.

అంతేగాక హైదరాబాద్ తెలంగాణ విమోచన మ్యూజియం ఏర్పాటు చేయాలని వివరించారు.

ప్రతి జిల్లా కేంద్రంలో తెలంగాణ విమోచన స్ఫూర్తి కేంద్రం ఏర్పాటు చేయాలని,

పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విభజన చరిత్ర అజ్ఞాత వీరుల అధికారిక జాబితా రూపొందించాలన్నారు.

రజాకార్ల దురాగతాలకు గురైన గ్రామాల్లో విమోచన స్మారక స్థూపాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలన్నారు.

కాగా తెలంగాణ సప్త సంకల్పాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు జిల్లా పరిధిలో అమలు చేయాలని కోరారు. ఈ అంశాలపై తగిన చర్యలు చేపట్టి సెప్టెంబర్ 17న అధికారికంగా తెలంగాణ వియోచన దినోత్సవం గా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జాటోత్ వెంకన్న నాయక్, జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి, జిల్లా కార్యదర్శి దురిశెట్టి కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రాకేష్ బాబు,మహిళా మోర్చా అధ్యక్షులు సముద్రాల గాయత్రి, జిల్లా మహిళా మోర్చా జనరల్ సెక్రెటరీ మువ్వ అపర్ణ, పాల్వంచ టౌన్ అధ్యక్షులు రాపాక రమేష్, చుంచుపల్లి మండల అధ్యక్షులు బలగం శ్రీధర్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు వీర ప్రతాప్, మైనార్టీ మోర్చా రాష్ట కార్యవర్గ సభ్యులు సలీం తదితరులు పాల్గొన్నారు.

# మర్పల్లి మండలానికి భారీ మార్పు!

**పంచాయతీరాజ్ సబ్ డివిజన్ వికారాబాద్‌కు బదలాయింపు ,స్పీకర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు మహమ్మ గౌస్**

**తాండూర్ వెళ్లే కాంట్రాక్టర్లకు తప్పిన ఇబ్బందులు.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక చొరవ**

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధిమర్పల్లి, సెప్టెంబర్ 12(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలానికి ప్రభుత్వం కీలక మార్పు చేసింది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖపరిధులపునర్వ్యవస్థీకరణలో భాగంగా మర్పల్లి పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌ను తాండూర్ పరిధి నుంచి వికారాబాద్ పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలోకి మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ జీవో ఎంఎస్ నెంబర్ 32, తేదీ 10-09-2026ను విడుదల చేసింది.ఇప్పటివరకు మర్పల్లి, బంట్వారం, మోమిన్‌పేట్ ప్రాంతాలకు చెందిన పంచాయతీరాజ్ పనులు చేపట్టే కాంట్రాక్టర్లు పనుల బిల్లులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ తదితర పనులకు సంబంధించిన వ్యవహారాల కోసం తాండూర్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. దూరభారం, సమయాభావంతో పాటు ఒకే పనికి పలుమార్లు తాండూర్ వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇకపై వికారాబాద్ పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలోనే పనులు పూర్తి చేసుకునే అవకాశం కలగనుంది.

కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ప్రియతమ నాయకులు మంచి మనసున్న మా ఎమ్మెల్యేవికారాబాద్ ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య తీవ్రతను గుర్తించిన స్పీకర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పరిధి మార్పునకు మార్గం సుగమమైందని కాంగ్రెస్ నాయకులు మర్పల్లి సబ్ డివిజన్ వికారాబాద్ పరిధిలోకి రావడంతో కాంట్రాక్టర్లు, సంబంధిత పనులు చేపట్టే



వారికి దూరభారం తగ్గి, బిల్లులు మరియు ఇతర అధికారిక పనుల కోసం వికారాబాద్‌లోనే వ్యవహారాలు పూర్తి చేసుకునే అవకాశం ఏర్పడింది. ఇంత మంచి కార్యక్రమాన్ని మూడు మండలాలకు కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియపరుస్తున్నామని మహమ్మద్ గౌస్, మహమ్మద్ సలీమో దిన్, పాండురంగ రెడ్డి, చంద్రన్న, నారాయణరెడ్డి, నవీన్ న్, రాజశేఖర్ రెడ్డి, పలు వురు వికారాబాద్ శాసనసభ్యు లు తెలంగాణ శాసనసభాపతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారికి ప్రశంసలు ధన్యవాదాలు తెలిపారు

# ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ




**హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, సెప్టెంబర్,11: హైదరాబాద్ ప్రెస్ క్లబ్, హెచ్.ఎం.డి.ఏ ఆధ్వర్యంలో మట్టి గణేష్ విగ్రహాలను సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం నాడు పంపిణీ ప్రారంభించారు. ప్రెస్ క్లబ్ సభ్యులతోపాటు సాధారణ పౌరులకు మట్టి గణేష్ ప్రతిమలను పంపిణీ చేయడం జరుగుతుంది. ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి ,రమేష్ వరికుప్పల, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అమిత్ బట్టు, ముత్యాల సత్తిబాబు , ఎన్. ఉమా దేవి, మనం నాగరాజు, హెచ్.ఎం.డి.ఏ ఎస్. ఈ అప్పారావు, డిప్యూటీ ఈ ఈ గణేష్, అసిస్టెంట్ ఈ ఈ ఆశుతోష్ వర్మలు గణేష్ మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఏటా మట్టి గణేష్ విగ్రహాలను ప్రెస్ క్లబ్ పాలకమండలి హెచ్.ఎం.డి.ఏ నేతృత్వంలో పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణేష్ విగ్రహాలను పూజించాలని ప్రెస్ క్లబ్ పాలకమండలి విజ్ఞప్తి చేసింది.

# తెలంగాణలో మళ్లీ సర్కార్ వచ్చేది బి ఆర్ ఎస్ పార్టీ పక్క ఘనపూర్ సంతోష్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 11(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం తెలంగాణ ప్రభుత్వంలో మళ్లీ సారే వస్తాడు సర్కార్ బి ఆర్ ఎస్ ది పక్కా అని ఘనపూర్ సంతోష్ ధీమా వ్యక్తం చేశారు తెలంగాణ అభివృద్ధి సంక్షేమ పథకాలు కేవలం బి ఆర్ ఎస్ ప్రభుత్వానికే సాధ్యమని తెలిపారు ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం చరిత్రలో బాగుపడ్డట్టు లేదని ఇది పక్కా తెలంగాణ బిడ్డల సహనం ఓర్పు బాధ బిఆర్ఎస్ గెలుపుకే నాంది అని ఘనపూర్ సంతోష్ తెలిపారు

# జెన్-జీ'లపై సీఎం 'చంద్రబాబు' ఆసక్తికర వ్యాఖ్యలు

అమరావతి ఏసీ గదుల్లో కూర్చుని ప్రజల సమస్యలు పట్టించుకోకపోతే.. 'జెన్-జీ' ప్రశ్నిస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేసారు. సరైన న్యాయం జరగలేదనిపిస్తే ఎవరైనా ప్రశ్నిస్తారు" అంటూ కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. ప్రజల సమస్యలపై అధికారులు సానుభూతి, మానవీయ దృక్పథంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని సరైన ప్రణాళికతో పాలన అందించాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేసారు.

# ఆటల్లో.. నస్కల్ విద్యార్థుల ప్రతిభ



**నిజాంపేట్ మండల ప్రజాబలం ప్రతినిధి యెదుగని అంజయ్య :** నిజాంపేట మండల స్థాయిలో నిర్వహించిన ఆటల్లో నిజాంపేట మండలం నస్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల స్థాయిలో నిర్వహించిన క్రీడలలో విజయం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం రెడ్డి తెలిపారు. కబడ్డీ అండర్ 14 విభాగంలో బాలికల జట్టు ప్రథమ బహుమతి, కబడ్డీ అండర్ 17 విభాగంలో బాలికల జట్టు ద్వితీయ బహుమతి, ఖో - ఖో అండర్ 17 విభాగంలో బాలికల జట్టు ద్వితీయ బహుమతి సాధించారన్నారు. క్రీడల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలన్నారు. విజయం సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

# మండల పరిషత్తులో సర్వసభ్య సమావేశం



**నిజాంపేట్ మండల ప్రజాబలం ప్రతినిధి యెదుగని అంజయ్య :** నిజాంపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో రాజు రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ అధికారి దేవకుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఏలినో ప్రభావం వల్ల రాబోయే మూడు నెలల్లో త్రాగునీరుకు అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని నీటిని వృధా చేయకుండా సమృద్ధిగా వాడుకోవాలని తెలిపారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద రైతులు ఫారం పండ్లను ఏర్పాటు చేసుకొని నీటి సమృద్ధిని సమకూర్చుకొని పంటలకు అనుగుణంగా వాడుకోవాలని తెలిపారు. మండలంలో ఆయా శాఖల అధికారులు హాజరై శాఖల వారీగా వారి వారి పని విధానాలను సర్పంచులకు సెక్రటరీలకు ఉన్నతాధికారులకు తెలియజేశారు. మండలంలో కరెంటుతో గ్రామాలలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్యను సర్పంచులు స్పెషలా అధికారికి కరెంట్ అధికారులకు విన్నవించారు. వెటర్నటీ, మిషన్ భగీరథ, ఉపాధి హామీ, మహిళా శిశు సంక్షేమ, ఆర్టీసీ, ఫారెస్ట్, ఆప్కారి శాఖ, పిహెచ్సి, ఇరిగేషన్, ఎస్సై జి తదితర శాఖల అధికారులు హాజరై గ్రామాల సర్పంచులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రజినీకాంత్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు కార్యదర్శులు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బీసీల ధర్మ పోరాట దీక్షల సందర్భంగా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందించిన .. జాతీయ బి.సి సంక్షేమ సంఘం నాయకులు



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 11:** దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగణలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 1-5- 2025 న నిర్ణయం తీసుకొని ప్రకటించింది.కానీ ఇప్పుడు కులగణన శాస్త్రీయమైన పద్ధతిలో చేయకుండా, ఓబీసీ కుటుంబాలను లెక్కించకుండా, బీసీ కాలం లేకుండా, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ లేకుండా బిసీలకు అన్యాయం చేస్తుంది, రెండవసారి అప్పుడే జాతీయ జన గణన ఆగస్టు 17వ తేదీ నుండి ప్రారంభం మొదలుపెట్టింది బీసీలను మోసం చేసే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, నయవంచను వ్యతిరేకిస్తూ ఈనెల 11 వ తేదీన (శుక్రవారం) రోజున తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, కేంద్రాల్లోబీసీల ధర్మ పోరాట దీక్షలు చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో అదనపు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కేవీ కృష్ణారావు, జిల్లా అధ్యక్షులు బత్తిని మధు గౌడ్, గౌరవ అధ్యక్షులు బచ్చల పద్మాచారి, రాష్ట్ర కార్యదర్శి మోత్కూరి వెంకటేశ్వర చారి జిల్లా ఉపాధ్యక్షులు పార్థసారథి పుల్లూరు వెంకన్న బాబు,నాగరాజు యాదవ్ గుడిగంటి వీరన్న రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు నమ్మకండి డాక్టర్ వేము గంగరాజు



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 11:** తనపై జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దంటూ డాక్టర్ గంగరాజు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గంగరాజు మాట్లాడుతూ తన సోదరి తన భర్త నేను ఐదు కోట్ల రూపాయలు ఇవ్వాలని చేస్తున్న ప్రచారాలలో వాస్తవం లేదని, నిజ నిజాలు ప్రజలకు తెలుస్తాయని తెలిపారు. తన సోదరి మతిస్థిమితం సరిగా లేక చికిత్స పొందుతు మందులు కూడా వాడుతుందని తెలిపారు. అనారోగ్య కారణంగా ఇలాంటి అసత్య ప్రచారాలు చేశారని అందులో వాస్తవం లేదని విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

## మండల స్థాయి క్రీడా పోటీల్లో గాయపడిన సింగూర్ విద్యార్థి మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండల స్థాయి ఆటల పోటీల్లో భాగంగా రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో నిన్న గురువారం నిర్వహించిన కబడ్డీ పోటీల్లో (రెసిడెన్షియల్ స్కూల్ వర్సెస్ సింగూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్) ఆడుతున్న సమయం లో సింగూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి అలుగోల గంగాధర్, భుజం ఎముక విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్పందించిన జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుదర్శన్,దత్తురావు, ప్రసాద్ శర్మ ,లు మండల విద్యాధికారి శంకర్ కు సమాచారం అందించి, విద్యార్థిని హుటాహుటిన సంగారెడ్డిలోని సిటీ హాస్పిటల్ లో చేర్పించిచికిత్స అందించారు. ఈ విషయం తెలుసుకున్న సింగూర్ ప్రజాప్రతినిధులు గ్రామ సర్పంచ్ నందికంటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎర్ర శేఖర్,పుల్కల్ మండల విద్యాధికారి శంకర్ తో మాట్లాడి గాయపడిన విద్యార్థికి సకల సౌకర్యాలు చికిత్సలు అందేలా చూడాలని వారు కోరారు. మండల విద్యాధికారి తక్షణమే చొరవ తీసుకొని వైద్య ఖర్చు ఎంతైనా పర్వాలేదు, మేము భరిస్తాం అని భరోసా ఇచ్చి, చికిత్సకు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థి తల్లిదండ్రులకు గ్రామప్రజా ప్రతినిధులు కుటుంబాన్ని పరామర్శించి రాత్రి సర్జరీ పూర్తయ్యే వరకు మండల విద్యాధికారి, వారి స్టాఫ్, ఉప సర్పంచ్ ఎర్ర శేఖర్, మైనార్టీ నాయకులు ముజీబ్, గ్రామ సర్పంచ్ నందికంటి శ్రీనివాస్, హాస్పిటల్ లోనే ఉండి, విద్యార్థి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. మళ్లీ ఉదయం మండల విద్యాధికారి సిటీ హాస్పిటల్ కు వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థి గంగాధర్ను పరామర్శించి, తల్లిదండ్రులకు డబ్బుల గురించి మీరు దిగులు పడవద్దు, అతను మా విద్యార్థి, బాధ్యత మాది అని ధైర్యం చెప్పారు.

ఇలాంటి విపత్కర పరిస్థితిలో తక్షణమే స్పందించి విద్యార్థికి అండగా నిలిచిన (ఎంఈఓ,) మరియు ప్రహ్లాద్, సత్యం,యాదగిరి, ఉపాధ్యాయులకు సర్పంచ్, ఉప సర్పంచ్ లకు తల్లిదండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు..

# ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు.. సరైన కౌన్సెలింగ్‌తో కొత్త జీవితం సాధ్యం!





**రాజన్న సిరిసిల్ల జిల్లా,సెప్టెంబర్ 11, (ప్రజాబలం ప్రతినిధి )** ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా.ఆర్ఎంపీ పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో.తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల వారి సహకారంతో.ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజల్లో ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మానసిక ఆరోగ్య నిపుణులు సూచించారు.

జీవితంలో ఎదురయ్యే ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, ప్రేమ విఫలం, విద్యా ఒత్తిడి, ఉద్యోగ సమస్యలు, ఒంటరితనం, సంబంధాల్లో సమస్యలు వంటి అనేక కారణాల వల్ల కొంతమంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారు. అలాంటి సమయంలో "నా సమస్యకు పరిష్కారం లేదు" అనే భావన కలగవచ్చు. అయితే ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు. సరైన సమయంలో అందే మానసిక సహాయం, కుటుంబ సభ్యుల మద్దతు మరియు నిపుణుల కౌన్సెలింగ్ ద్వారా పరిస్థితిని అధిగమించవచ్చు.

ఆత్మహత్య గురించి ఆలోచిస్తున్న వ్యక్తిలో తీవ్రమైన నిరాశ, ఒంటరిగా ఉండాలనే ప్రయత్నం, "నేను లేకపోతే బాగుంటుంది" వంటి మాటలు మాట్లాడటం, వ్యక్తిగత వస్తువులను ఇతరులకు ఇవ్వడం, ఆకస్మిక ప్రవర్తనా మార్పులు వంటి హెచ్చరిక సంకేతాలు కనిపించవచ్చు. వీటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించాలి.

ఎవరైనా ఆత్మహత్య గురించి మాట్లాడితే వారిని విమర్శించకుండా, ప్రశాంతంగా వినాలి. "అలా ఎందుకు ఆలోచిస్తున్నావు?" అంటూ నిందించకుండా, "నేను నీతో ఉన్నాను, నీకు సహాయం చేయడానికి ప్రయత్నిస్తాను" అనే భరోసా ఇవ్వాలి.

ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యాన్ని శారీరక ఆరోగ్యంతో సమానంగా పరిగణించాలని, సమస్యలను మనసులో దాచుకోకుండా అవసరమైనప్పుడు సహాయం తీసుకోవాలని మానసిక ఆరోగ్య నిపుణులు టి పి ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు సైకాలజిస్ట్ కనుకుంట్ల పున్నం చందర్ , టి పి ఏ వైస్ ప్రెసిడెంట్ అలవాల ఈశ్వర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఎం పీ , పి ఎం పి అసోసియేషన్ అధ్యక్షులు కుడికాల రవికుమార్ గౌరవ అధ్యక్షులు మాసం భాస్కర్ , మాజీ జిల్లా అధ్యక్షుడు దాసి రాజమల్లు, మిట్టపల్లి రాజమౌళి జడల అశోక్ తవటం శ్రీకాంత్, గెంట్యాల ఆంజనేయులు , ఆర్.ఎం.పి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మల్లారం గ్రామంలో కొత్త పెన్షన్ల భౌతిక తనిఖీ



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 11:** తల్లాడ మండలం మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త ఆసరా పెన్షన్ల భౌతిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి వారి అర్హత, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు మరియు నివాస ధృవీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకే పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ తనిఖీ కార్యక్రమంలో గౌరవ సర్పంచ్ కటికి కిరణ్ కుమార్,మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పెన్షన్ ఇంచార్జ్ నాగేశ్వరరావు , సామాజిక భద్రత విభాగం విష్ణు, రాజేశ్వర రావు , ఫీల్డ్ అసిస్టెంట్, మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అర్హులైన వారికి త్వరలోనే పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందని పూనా గారు ఈ సందర్భంగా తెలియజేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com